
POSTAL REGD.NO.PRAKASAM/2026-2028
REGD.NO. APTEL/26/A0220
ESTABLISHED : 1983
మార్చి 2026
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక
సంపుటి: 43 సంచిక: 11



## పూజ్య గురుదంపతుల లీలాకళ్యాణ వేడుకలు

05 - 08, మార్చి 2026

# ఈ నెల పండుగలు

మార్చి 06 - పూజ్య గురుదంపతులు శ్రీ అలివేలుమంగాభరద్వాజ మహరాజ్ లీలాకళ్యాణ మహోత్సవము

మార్చి 19 - ఉగాది

మార్చి 20 - శ్రీ స్వామి సమర్థ ప్రకటమైన రోజు (తిథి - చైత్ర శుద్ధ విదియ)

మార్చి 25 - పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మహరాజ్ ఆరాధనా మహోత్సవము (తిథి-చైత్ర శుద్ధ సప్తమి)

మార్చి 27 - శ్రీరామనవమి

మార్చి 27 - శ్రీ సిద్ధారూఢ స్వామి జయంతి (తిథి ప్రకారము - చైత్ర శుద్ధ నవమి)



"పూజ్యశ్రీ మాస్టరుగారు అత్యున్నత గృహస్థాశ్రమాన్ని గడిపారు. ఆయన ఆధ్యాత్మిక జీవితాన్నే ఎంచుకున్నప్పటికీ లౌకిక జీవితాన్ని నిర్లక్ష్యం చేయలేదు. మానవ జీవితం సక్రమంగా నడవడానికి ఆధ్యాత్మికత, లౌకికత రెండూ రెండు కాళ్ళవంటివని, అలా లేని జీవితం కుంటినడక వంటిదనీ ఆయన చెప్పేవారు. అంతేగాక ఆధ్యాత్మికత లేనిదే లౌకిక జీవితం సరిగ్గావుండదు. అందుకని 'ఆధ్యాత్మికత అన్నది పునాది వంటిది. అది లేని లౌకిక జీవితం పతనం కాక తప్పదు' అని గూడ ఆయన చెప్పేవారు."

~ పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ ~

# గురువుకు పగ్గాలప్పగించడమంటే ఏమిటి?

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

నిర్దుష్టమైన ఆర్ష జీవిత విధానమే జీవిత కళ అన్నాము. చెట్టున కాయ కాచాక అది కాలగతిలో పండడమనేది దానికై అదే జరిగినట్లు, 'కాలేన ఆత్మనివందతి' అన్న గీతా వాక్యానుసారం జ్ఞాన పరిపాకం అదే కలుగుతుందన్నాము. అయితే కాలగతిలో పాలు తోడుకోవడం దానికి అదే జరుగుతుందన్నాము. అయితే చెట్టునున్న కాయను తొందరపడి కోయగూడదు. అలానే జ్ఞాన పరిపాకం లేక పుస్తక పరిచయ మాత్రంతో జ్ఞానులమని భ్రమించి జ్ఞానబోధకుపక్రమించే ప్రచారకుల మిధ్యాబోధను నమ్మి ఏదో పరమార్థాన్ని బావుకోవాలని భ్రమించి ఐహికాన్ని పరిత్యజించడం కాయ పక్వం కాకముందు కాయను కోయడమవుతుంది; ఉభయభ్రష్టత్వమే ప్రాప్తిస్తుంది. ఆత్మజ్ఞానులైన శిరిడీ సాయినాథుడు, భగవాన్ రమణమహర్షి వంటివారు తమ భక్తులెవరినీ ఐహిక జీవితాన్ని పరిత్యజించమని చెప్పలేదన్నది గమనార్హం. "మరి మీరు పరిత్యజించారు గదా!" అనడిగిన భక్తునితో "నేను పరిత్యజించాలని కోరి పరిత్యజించలేదు. ఏదో అతీతమైన శక్తి నాప్రమేయం లేకనే అలా నడిపించింది" అన్నారు రమణులు. అలానే శ్రీ సాయి చెంతకు వచ్చి "నాకీ సంసారం వద్దు", అని చెప్పిన అర్హుడైన ముస్లిం భక్తునికి మాత్రమే వైరాగ్యాన్ని బోధించి అందులో నిశ్చలతననుగ్రహించి కృతార్థుణ్ణి చేయడం గమనార్హం. అదే త్వరపడి పరిపాకం రాకమునుపే కాషాయం మాత్రం ధరించి మృత్యు ముఖంలోనున్న తల్లిని చూడాలని తపించిన విజయానందుణ్ణి "తల్లి మీద అంత మమకారమున్న వాడివి ఎందుకు సన్యసించావు?" అని సాయి మందలించడం గమనార్హం. పరిపాకం రాకమునుపే అలా జీవించడమెంత దుర్భరమో! తనకు 'ఫకీరుస్థితి'ని అనుగ్రహించమని వేధించిన ఒక భక్తునికి తాత్కాలికంగా అట్టి స్థితినిచ్చి, అదెంత దుర్భరమో తెలిసి, వద్దని వేడుకొన్నాక ఆ స్థితిని తిరిగి తీసుకొని సామాన్యమైన జీవితాన్ని ప్రసాదించడం గమనార్హం. ఏది ఉత్తమమైన జీవిత విధానమో తెలిస్తే దానిని సంపూర్ణంగా అనుసరించే పట్టుదల కల్గియుండి కేవలం అజ్ఞానంవల్ల మాత్రమే విలాస జీవితం గడుపుతున్న బాలాభాటేకు సాయిబాబా జ్ఞానం ప్రసాదించి ఉత్తమ గృహస్థ జీవితాన్ని జీవింప చేయడంగూడ గమనించాలి.

ఇంతేకాదు. చెట్టున కాచిన కాయకు పురుగు పట్టకుండా కాపాడుకోవాలి. తోడేసిన పాలను మాటిమాటికీ కదపకుండడము, అందులో ఏదైనా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:43 మార్చి - 2026 సంచిక:11

***పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"***

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | గురువుకు పగ్గాలప్పగించడమంటే ఏమిటి? | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | గృహస్థాశ్రమము | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 06 |
| 03. | శ్రీసాయిలీల - దివ్యలీలాకల్యాణం | శ్రీమతి అడిదం వేదవతి | 10 |
| 04. | మాతృదేవి స్మృతులు | శ్రీమతి అంజని | 15 |
| 05. | సన్నిధానంలో గురు భరద్వాజుని బ్రహ్మానుభూతి పర్వదినం! | శ్రీమతి టి. పద్మావతి | 18 |
| 06. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీ గిరికుమార్ | 22 |
| 07. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీ రామకిషన్ రావు | 28 |


సలాభావం వల్ల ఈ సంచికలో ధారావాహికలు ప్రచురింపబడటం లేదు. – ఎడిటర్

పూజ్య గురు దంపతుల లీలాకళ్యాణ మహోత్సవ వేడుకలు శ్రీ అలివేలు మంగమ్మ దివ్యసన్నిధానములో మార్చి 5 వ తేదీ నుండి 8 వ తేదీ వరకు జరుగును. భక్తులందరూ ఈ విశేష కార్యక్రమంలో పాల్గొని శ్రీ సాయినాథుని యొక్క, పూజ్య గురుదంపతుల యొక్క కృపాశీస్సులు పొందగలరు.

**చిరునామా**

Sri Manga Bharadwaja Trust,
Kondaiah Bunk Street, Kothapeta,
Ongole, Prakasam District, A.P. - 523002
Phone No. 08592 233271
**www.saibharadwaja.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

**చందా వివరములు**

విడి ప్రతి : ₹10-00
సంవత్సర చందా : ₹100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

అనుచితమైన పదార్ధం పడి, అది పాడవకుండా చూచుకోవాలి. అదీ మన కర్తవ్యం. కర్మయోగమంతా యీ కార్యక్రమమే. పాలు తోడుబెట్టే ముందు పాత్రను శుభ్రంచేసి సిద్ధంచేసుకోవడంలాంటిది బ్రహ్మచర్యం. చెట్టుకు పురుగు బట్టకుండా చూచుకొంటూ అది ఏపుగా పెరిగేలా చూచుకోవడం లాంటిది, అటు తర్వాత దానికి కంచె కట్టడం లాంటిది, పాలు తోడు బెట్టిన పాత్ర పైన మూత పెట్టడం లాంటిది, ఆ పాత్రను పిల్లలు కదపకుండా భద్రపరచడం లాంటిది గృహస్థం. పేరుకున్న పెరుగును చిలికి మజ్జిగ వాడుకోవడం లాంటిది వానప్రస్థం. తీసిన వెన్ననుకాచి నెయ్యివాడుకోవడం లాంటిది సన్యాసాశ్రమం.

ఐహిక జీవిత మంతా అంతఃకరణకు మాలిన్యం సోకకుండా చూచుకోవడమే. జీవిత ఫలానికి రాగ ద్వేష అసూయాది పురుగులు పట్టకుండా, అధర్మమనే పశువులు మేయకుండా చూచుకోవడమే. అదే ధర్మం! అందుకే ధర్మాన్ని నిర్దుష్టమైన ఆచరణతో రక్షిస్తే అది మనలను రక్షించి – జీవిత సాఫల్యాన్నిస్తుంది.

అందుకే **సాయినాథుని బోధలో ప్రధానంగా అసూయ, ద్వేషం, పర నింద, కామం మొదలైన దోషాలనెలా నిర్మూలించుకోవాలో చెప్పిన ఘట్టాలూ, సూక్తులే అధికంగా వుంటాయి. కారణం వాటిని అశ్రద్ధ చేసినవారు యికయే సాధనలు చేసినా నిష్ఫలమే. వాటిని సాధిస్తే చాలు, జీవితమనే ప్రవాహమే మనను గమ్యం చేరుస్తుంది.** సాయిబాబా వంటి సద్గురు బోధలను శిరసావహించి



ఎన్ని తాత్కాలికమైన యిబ్బందులొచ్చినా చలించక నడచుకోవడమే దక్షిణ; నిష్ఠ; ఓరిమి. "గురువుకు పగ్గాలప్పగించాక చింతకు తావులేదు" అని ఆయన చెప్పిన మాటలలో పగ్గాలప్పగించడమంటే ఆయనపై నిశ్చలమైన విశ్వాసాన్నుంచి ఆయన బోధను పరమగతిగా ఆశ్రయించడమే. ఈ సాధనలో మన హృదయగత భావాలపట్ల జాగరూకత కల్గియుండాలి. అందుకే 'సాయి శరణానందు'లనే భక్తునికి ఆయనిచ్చిన హెచ్చరిక 'దక్ష!' అంటే 'జాగ్రత్త!' అని. నిత్యము దంత ధావనము, స్నానములతో శరీరాన్ని శుద్ధి చేసుకొన్నట్లే నిరంతరం హృదయాన్ని సాయి బోధించిన వివేకంతో శుద్ధి చేసుకొంటూ ఆయనపట్ల భక్తి అనే సుగంధ ద్రవ్యంలో మన అంతఃకరణను అలంకరించుకోవాలి.●

*(ఏప్రిల్ 2015 సాయిబాబా మాసపత్రిక నుండి)*

# గృహస్థాశ్రమము

***పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ***

ఈ సృష్టి అతి విచిత్రమైనది. దీని ప్రక్రియ జన్మించుట, వసించుట, నశించుట. దీనిలో జన్మించుట లేకుండా మిగతా రెండూ వుండవు. అంటే జన్మించుట అనునది ఇందులోని అతి ప్రధానమైన అంశము.

అయితే ఈ సృష్టిలో అనేకానేక జీవరాశులు తమ జాతిని పెంపొందించుటకై పునరుత్పత్తి కొనసాగించేలా వ్యవస్థ ఏర్పడింది. ప్రతి జీవీ ప్రకృతి నిర్దేశించిన విధంగా ఈ ప్రక్రియను కొనసాగిస్తుంది. కానీ మానవుడు మేధస్సు కలవాడు గనుక ఈ ప్రక్రియను అత్యున్నతంగానూ, అతి నీచంగానూ గూడా మలచుకోగలడు. అత్యున్నతంగా మలచుకున్నప్పుడు ఈ సృష్టిలోని ప్రతి జీవీ సుఖశాంతులతో వర్ధిల్లగలదు. అలా గాక దానిని మరో విధంగా మరల్చుకున్నప్పుడు ఈ సృష్టిలో అస్తవ్యస్తత తప్పదు. ఈ విషయాన్ని నిర్దుష్టంగా ఆలోచించి వేదఋషులు మానవుని వల్ల జరిగే ఈ సృష్టి ప్రక్రియను ఒక యజ్ఞంగా మలచారు. అదే వివాహక్రతువు. యజ్ఞ పూరితమైన మానవ జీవితం సృష్టియజ్ఞంలో అత్యున్నత స్థానాన్నాక్రమించి సృష్టి అంతటా శాంతిని నెలకొల్పుతుంది.

అందుకే సృష్టియజ్ఞ భాసస్థులైన మిగతా లోకాలవారు – దేవ గంధర్వాదులు కూడా – మానవులు చేసే ఇట్టి యజ్ఞ దీక్షను ఆకాంక్షిస్తుంటారు. కారణం, వారికి అట్టి అవకాశం లేదు గనుక! అయితే ఈ యజ్ఞంలో వారి పాత్ర లేకపోలేదు. వారి సహకారం లేనిదే ఈ సృష్టి కొనసాగదు. అందుకనే పెద్దలు 'పరస్పరం భావయంతః' అని చెప్పారు. కనుక ఈ వివాహక్రతువులో భాగంగా దిక్పాలకులతో ప్రారంభించి సకల దేవతలను ఆహ్వానించడం జరుగుతుంది. వారికి ఆహుతులను సమర్పించడం కూడా జరుగుతుంది. అందువల్ల వారు సంతుష్టి చెంది ఈ యజ్ఞానికి ఆశీస్సులు అందిస్తారు, ఎంతగానో సహకరిస్తారు.

వేదోక్త ప్రకారంగా ఈ సృష్టి యజ్ఞాన్ని కొనసాగించినవారు ఋషులు. అట్టి వారి జీవితమంతా ఒక తపస్సే. అట్టి తపోనిష్ఠులైనవారికి జన్మించేవారు అవతారపురుషులు, అవధూతలు, మహాత్ములు.

ఇందులో మహాత్ములకొక ప్రత్యేకత వున్నది. వీరిని అందరికంటే ఉత్తమశ్రేణిగా చెప్పక తప్పదు. కారణం అవతారపురుషులు ఈ సృష్టిలో ధర్మగ్లాని కలిగినపుడు అందుకు తగిన అవతారమెత్తి ధర్మాన్ని ప్రతిష్ఠించి నిష్క్రమిస్తారు. అవధూతలు ఆత్మావలోకమునందు నిమగ్నులై, తమలో తాము ఆత్మానందాన్ని గ్రోలుతుంటారు. అట్టివారివలన అంతర్లీనంగా ఈ సృష్టికి శ్రేయస్సు కలుగుతున్నప్పటికీ ఎక్కువగా సృష్టిలో మార్పు కనిపించదు.

అలాగాక మహాత్ములు ఈ సృష్టిలో ధర్మోద్ధరణను సంకల్పించి అవతరిస్తారు. కనుక వారు ప్రతి జీవినీ ఉద్ధరించడానికి ప్రత్యేక ప్రయత్నాలు చేస్తారు. అందులో ప్రధానమైన భాగంగా మానవ జీవితాలను



ఉత్తమంగా మలచబూనడం వీరి యొక్క లక్ష్యం. ఆయా దేశకాలపరిస్థితుల ననుసరించి మానవులకు సరియైన మార్గమును నిర్దేశిస్తారు.

గృహస్థాశ్రమం అతి విశిష్టమైనది, అతి క్లిష్టమైనది కూడా. దీనిని సరిగ్గా నిర్వహించలేకపోతే ధర్మగ్లాని సంభవిస్తుంది. ఇతర ఆశ్రమాల వలన అంతటి ప్రమాదం వుండదు. కారణం, ఒక బ్రహ్మచారి తన ఆశ్రమ ధర్మాలను తప్పితే అతనికి, మరికొద్దిమందికి మాత్రమే నష్టము వాటిల్లుతుంది. అలాగే సన్యాసి తన ధర్మం తప్పినా కూడా. కానీ ఒక గృహస్థు తన ధర్మాన్ని తప్పినట్లైతే అట్టివారి సంతానం వలన సమాజానికి తీరని నష్టం కలుగుతుంది. ధర్మభ్రష్టులైన సంతతి వల్ల సమాజం అస్తవ్యస్తమై అనేక విధాలుగా కష్టనష్టాలకు లోనౌతుంది.

గృహస్థాశ్రమంలో మిగతా ఆశ్రమాలలో వలనే విధి నిషేధాలుంటాయి. అంతేగాక బ్రహ్మచారుల, సన్యాసుల జీవనం కూడా ఈ గృహస్థాశ్రమ జీవనం మీదే అధారపడివుంటుంది. వారిని పోషించవలసిన బాధ్యత – గృహస్థులదే. ఈ ఆశ్రమంలో కుటుంబంలోని సభ్యులందరూ ఏకతాటిమీద నిలువవలసి వుంటుంది. ఎవరికి వారు వారికిష్టమైన రీతులలో ప్రవర్తిస్తే అది సరియైన సంసారము కాజాలదు. ఒడిదుడుకుల బాటయే అవుతుంది. అందుకని ఎవరు ఏఏ విధులను నిర్వర్తించాలో మన వేదఋషులు ఖచ్చితమైన పద్ధతిలో నిక్కచ్చిగా చెప్పారు. యజమాని యొక్క ధర్మము, యజమానురాలు యొక్క ధర్మము, పెద్దల ధర్మము, పిల్లల ధర్మము కూడా చక్కగా చెప్పారు. వారు చెప్పిన ప్రకారం ఆలోచించి ప్రయత్నిస్తే కుటుంబం సుఖశాంతులతో వర్ధిల్లుతుంది. ఆలోచించకుండా గుడ్డిగా నమ్మినా అలాగే వుంటుంది. కాని దీనిలో కొంత ప్రమాదం పొంచివుంటుంది. ఏమైనా ఎందుకు చేయాలో, ఎందుకు చేయకూడదో తెలియకపోతే ఎప్పుడైనా 'అసలు ఎందుకు చెయ్యాలి? చెయ్యకపోతే ఏమి?' అనిపించవచ్చు.

నేటి సమాజంలో జరుగుతున్నదదే. ఏది ఎందుకు చెయ్యాలో చెప్పేవారు లేకపోవడం చేత ప్రతివారు వారివారి ఇష్టానుసారం ప్రవర్తించడం జరుగుతున్నది. దాని ఫలితంగా నేటి సమాజంలో ఎవరికీ ఏ విషయంలోనూ భద్రత లేదు. అందుకని శాంతి లేదు. అందుకని ప్రతి మనిషి అనేక సమస్యలలో చిక్కుకుని తత్ఫలితంగా మానసిక శాంతిని కోల్పోయి అవతలవారిమీద కోపగించుకోవడం జరుగుతుంది. దీనిలో ఎవరిది ఎప్పుడు పైచేయి అయితే వారి అధికారం నడుస్తుంది. అందుకని అవతలివాడు సమయం కోసం వేచివుండి అవకాశం వచ్చినప్పుడు అధికారం చెలాయిస్తాడు. ఇది సమాజంలో అన్ని రంగాలలోనూ తాండవిస్తున్నది.

అంతేకాదు, ఇది నేడు ప్రతి ఇంట్లోనూ జరుగుతున్న భాగోతమే. ఎవరికి వారు వారి సంస్కారాలననుసరించి ప్రవర్తించడంవల్ల ఇంట్లో ఏ ఒక్కరికీ ఇతరులతో పడదు. ప్రతి విషయంలోనూ సంఘర్షణే. ఈ తగవులు ప్రతి రోజూ సంభవిస్తున్నప్పటికీ ఎవ్వరూ తగ్గరు, ఊరుకోరు.

ఏ విషయంలోనైనా ఎవరిది వారికే సరి అనిపిస్తుంది. తన మాట, తన చేత సరియైనవి అనిపించడం వల్ల తాను తగ్గాలనిపించదు, ఊరుకోవాలనిపించదు.

అందుకని చిన్న ప్రపంచ సంగ్రామం కుటుంబంలోని వ్యక్తుల మధ్య జరుగుతూనే వుంటుంది. ఇలా తగవులతోనే జీవితకాలమంతా గడిచిపోతుంది. వీటి వలన కలిగే మానసిక అశాంతితోనే జీవుడు మరణిస్తాడు. ఇట్టి ప్రమాదాన్ని ఆలోచించారు కనుకనే మన పెద్దలు నిర్దుష్టమైన జీవిత విధానాన్ని ఆదేశించారు. ఎవరి ధర్మాలను వారు తప్పక నిర్వహించాలని చెప్పారు.

పెద్దలు చెప్పిన విధంగా నడుచుకుంటే కుటుంబంలోని అందరూ సుఖశాంతులతో జీవిస్తారు. అట్టివారిని ఆదర్శంగా తీసుకుని మిగతావారు అనుసరిస్తారు. క్రమంగా సమాజంలోని వారు సుఖశాంతులతో జీవిస్తారు.

వేదప్రోక్త ఉత్తమ గృహస్థ ధర్మాన్ని ఆచరించి తమ జీవితాన్ని యజ్ఞంగా మలచుకున్నవారు శ్రీమాన్ ఎక్కిరాల అనంతాచార్యులవారు. అందుకనే మహాత్ములైన పూజ్య ఆచార్య శ్రీ భరద్వాజ మాస్టరుగారు వారికి పుత్రుడుగా జన్మించారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు అత్యున్నత గృహస్థాశ్రమాన్ని గడిపారు. ఆయన ఆధ్యాత్మిక జీవితాన్నే ఎంచుకున్నప్పటికీ లౌకిక జీవితాన్ని నిర్లక్ష్యం చేయలేదు. మానవ జీవితం సక్రమంగా నడవడానికి ఆధ్యాత్మికత, లౌకికత రెండూ రెండు కాళ్ళవంటివని, అలా లేని జీవితం కుంటినడక వంటిదనీ ఆయన చెప్పేవారు. అంతేగాక ఆధ్యాత్మికత లేనిదే లౌకిక జీవితం సరిగ్గావుండదు. అందుకని "ఆధ్యాత్మికత అన్నది పునాది వంటిది. అది లేని లౌకిక జీవితం పతనం కాక తప్పదు" అని గూడ ఆయన చెప్పేవారు.

"నేటి సమాజంలో ధర్మబద్ధమైన లౌకిక జీవితం సాధ్యమా? కుటుంబంలోని వ్యక్తులు తలా ఒక వైపు, సమాజంలోని వ్యక్తులు తలా ఒక వైపు లాగుతుంటే ఎవరి జీవితమైనా ధర్మబద్ధంగా ఎలా నడుస్తుంది?" అన్న ప్రశ్న కలగడం సహజమే.

అందుకు పూజ్యశ్రీ మాస్టరుగారు ఇలా చెప్పారు: "ఆ మాట నిజమే. ఈ కలికాలంలో చాలా కష్టమే. కానీ ధర్మబద్ధమైన జీవితంలో వుండే సుఖశాంతులను అవగాహన చేసుకున్నవాడికి అది కష్టమనిపించదు. అట్టివాడు సమాజానికి ఎదురీదుతాడు."

కన్యాశుల్కము, వరకట్నము, సతీసహగమనము, బాల్యవివాహాలు, మొదలైన దురాచారాల నిషేధం కోసం, స్వాతంత్ర్య పోరాటాలు మొదలైన వాటిని సంస్కరించడానికి ఎందరో తమ జీవితాలను పణంగా పెట్టి సమాజానికి ఎదురీది సమాజంలో మార్పులు తెచ్చారు. వారే సంఘసంస్కర్తలు. ఆ విధంగా ఎవరూ పూనుకోకపోతే సంఘం ఎలా ఉద్ధరింపబడుతుంది? అందుకని అట్టి శ్రేయస్సును ఆకాంక్షించేవాడు సమాజానికి ఎదురు నిలబడితీరాలి. అందుకు మనమే సంసిద్ధులం ఎందుకు కాకూడదు? ఒకరు దృఢ సంకల్పంతో నిలబడితే మరికొందరు వారిని అనుసరిస్తారు. అందుకని 'ఇది సాధ్యమా' అనుకోవడంలో మన సంకల్పం బలహీనంగా వున్నదన్నమాట. నేటి సమాజ పరిస్థితులను చూస్తున్న వారికెవరికైనా దానిలోని అస్తవ్యస్తత కనిపించక తప్పదు. మరి దానిని తొలగించుకోడానికి మనము ఎందుకు పూనుకోకూడదు? 'మనకెందుకు అంతటి కష్టం? ఎవరైనా చేస్తే అనుభవిద్దాములే' అని చాలామందికి అనిపిస్తూవుంటుంది. అంటే ఎవరో కష్టపడితే మనము సుఖపడాలన్న స్వార్థం మనలో దాగివున్నదన్నమాట. అట్టి స్వార్థం వల్లనే అందరికీ అట్టి స్వార్థ బుద్ధి కలిగి ఎవరూ ముందుకు





అడుగువేయలేక పోతున్నారు. 'మనం కష్టపడాలేమో! ఎందుకు పడాలి?' అన్న స్వార్థం ప్రక్కకి పెడితే ఈనాడు మనము పడుతున్న అన్యాయాలు, అక్రమాలనుండి మన బిడ్డలైనా, బిడ్డలబిడ్డలైనా సుఖశాంతులతో మనగలిగేలా ప్రయత్నించినవారమౌతాము. లేకపోతే మనకంటే ఎక్కువ కష్టనష్టాలకు గురయ్యే ప్రమాదం ముందు తరాలవారికి సిద్ధంగా పొంచివుంది అన్నది అక్షరసత్యం. ఇది చాలామంది విజ్ఞాన శాస్త్రవేత్తలు, ఆధ్యాత్మికవేత్తలు హెచ్చరిస్తూనే వున్నారు.

అందుకు ప్రారంభం మన ఇంటినుంచే జరుగవలసివున్నది. ప్రతి ఇంటిలోని వారు ధర్మబద్ధమైన జీవితం గడపడానికి ప్రయత్నించాలి. అదే సమాజ ఉద్ధరణ. ఈనాడు ప్రతి రంగంలోనూ జరుగుతున్న కాలుష్యం అప్పుడే సమసిపోగలదు. ఉదాహరణకి ఒక్క విషయం చెప్పుకుందాము. తన భార్యను తప్ప ప్రతి స్త్రీని సోదరిగానూ, తల్లిగానూ చూసుకోవడం ప్రారంభిస్తే ఈనాడు జరుగుతున్న అత్యాచారాలు తత్ఫలితమైన హత్యాకాండలు నిర్మూలింపబడతాయి. అలాగే మిగతా విషయాలలో కూడా ఆలోచిస్తే అవి గూడ నిర్మూలింపబడతాయి.

అందుకని అత్యున్నతమైన గృహస్థాశ్రమం నిర్వర్తించడానికి ప్రతివారూ ప్రయత్నించాలి. యజమాని మాత్రమేగాక ఇంట్లోని వారందరూ కూడా ప్రయత్నించాలి. అందుకు గృహస్థు ధర్మబద్ధమైన జీవితాన్ని గడపడానికి నిర్ణయించుకోవాలి. యజమాని గట్టివాడైనప్పుడు తక్కినవారు అనుసరించక తప్పదు. 'రౌతు మెత్తనివాడైతే ఆ గుర్రం మూడు కాళ్ళమీద నడుస్తుంది' అనే సామెత ఉన్నది కదా! అయితే గృహస్థు బలవంతాన ఎవ్వరితో ఏదీ చేయించకూడదు. ఇంట్లోని ప్రతివారికీ ధర్మంపట్ల అవగాహన కలిగించాలి. అప్పుడే ఇంట్లోని వారు మనస్ఫూర్తిగా యజమాని మాటను పాటించగలరు. అట్టి కుటుంబాలు గల సమాజాన్ని ఒక్కసారి ఊహించుకుంటే మనకే అట్టి సమాజం ఎలావుంటుందో అవగతమౌతుంది.

కనుక గృహస్థాశ్రమంలో వున్నవారు, కొత్తగా స్వీకరించిన వారు, స్వీకరించబోయేవారు కూడా ఈ విషయాన్ని తప్పక ఆలోచించి తీరాలి. అందుకు తగిన దీక్ష పూనాలి. దక్షతతో వ్యవహరించాలి.

పూజ్యశ్రీ మాస్టరుగారు ఒకవైపు ఆధ్యాత్మిక జీవితాన్ని, మరోవైపు లౌకిక జీవితాన్ని కూడా సాటిలేని విధంగా అత్యున్నతంగా నిర్వర్తించారు. ఆయన జీవితాన్ని పరిశీలిస్తే కొంతవరకు మన జీవితాలను సరిదిద్దుకోవడానికి అవగాహన కలుగుతుంది. అట్టి అవగాహనతో ముందుకు సాగితే ఆయన బాటలో పయనించిన వారమౌతాము. అట్టివారిని ఆయన చేయిపట్టి నడిపిస్తారన్నదాంట్లో సందేహము లేదు.

అందుకే నేటినుంచీ ప్రతివారూ ఆయన నిర్దేశించిన బాటలో పయనించడానికి ప్రయత్నిద్దాము. సుఖశాంతులతో వుందాము.

జై సాయి మాస్టర్!

# శ్రీసాయిలీల - దివ్యలీలాకల్యాణం

**శ్రీమతి అడిదం వేదవతి**

సమర్థ సద్గురువైన శిరిడీ సాయినాథుడు సద్గురు పరంపరలోనే 'కోహినూర్ వజ్రం' వంటివారని ఎందరో మహాత్ములు కీర్తించారు. ఆ అఖండ చైతన్యమే తన బోధను పరిపూర్ణము, ఆచరణ యోగ్యము చేయడానికి స్వయంగా పూజ్యశ్రీ మాస్టరుగారు, మాతృదేవి అలివేలు మంగమ్మతల్లి రూపంలో గురుదంపతులుగా ఈ పుడమిపై అవతరించింది. వీరి వివాహం కేవలం ఒక లౌకికమైన సంఘటన కాదు; అది లోకకల్యాణార్థం సాక్షాత్తు సాయినాథుడు దివ్యసంకల్పంతో రచించిన దివ్యలీలాకళ్యాణం. ఆ దివ్యకళ్యాణానికి మధ్యవర్తులు, పెళ్ళిపెద్దలు శ్రీ పాకలపాటి గురువుగారు, అవధూత శ్రీ చీరాల స్వామి! శిరిడీ సాయినాథులే స్వయంగా వారిద్దరినీ వివాహం చేసుకోమని ఆజ్ఞాపించడమే కాకుండా ఇరువురి ఆధ్యాత్మిక జీవితానికి తామే బాధ్యత వహిస్తామని అభయమిచ్చారు. వారిని తమ శిష్యులుగా స్వీకరించారు. వారు తమ సద్గురుదేవునికి సర్వస్య శరణాగతి చెంది, త్రికరణశుద్ధిగా సేవించి వారి ప్రతిరూపాలై నిలిచారు. సాయినాథుని ప్రతి బోధకు, సూక్తికి ఆచరణ స్వరూపమే ఆ దివ్య దంపతులు. ఈ లీలాకల్యాణం మానవ చరిత్రలోనే ఒక అత్యంత అరుదైన మరియు అద్భుతమైన ఘట్టము. ఇటువంటి సందర్భం మానవ చరిత్రలో లేనేలేదు!

పూజ్యశ్రీ మాస్టరుగారు పాకలపాటి గురువుగారికి సాక్షాత్తు విష్ణుస్వరూపులై సాక్షాత్కరించగా, పూజ్యశ్రీ అమ్మగారు ఎందరో భక్తులకు సాక్షాత్తు లక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. పూజ్యశ్రీ మాస్టరుగారు అపర సాయి స్వరూపులని చీరాల స్వామి, రంగన్న బాబుగారు, గుళవణి మహారాజ్, గులాబ్ బాబా, వెంకయ్య స్వామి వంటి మహాత్ములు వేనోళ్ళ కీర్తించారు. మరికొందరు మహనీయులు వీరు సాక్షాత్తు దత్తాత్రేయ స్వామి అని చెప్పారు. ఈ సత్యాన్ని పరాడ్ సింగా అనసూయ మాత, రాఖాడీ బాబా, రామిరెడ్డి తాతగారు స్పష్టం చేశారు. సాక్షాత్తూ అనఘాదేవి తప్ప అంతటి దత్తాత్రేయుని మరెవరు వివాహమాడగలరు?

పూజ్యశ్రీ అమ్మగారిలోని ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని దర్శించిన శ్రీ సుధీంద్రబాబుగారు వారిని గొప్ప మహాత్మురాలిగా కొనియాడారు. గులాబ్ బాబా వారిని సాక్షాత్తూ తిరుమలలో కొలువై వున్న అలివేలు మంగమ్మ తల్లిగా కీర్తిస్తూ సాష్టాంగప్రణామం ఆచరించారు. పరాడ్ సింగాలోని అనసూయ మాత వారికి పుష్పాభిషేకం చేశారు. అవధూత మాయీ అమ్మ వారికోసమై వాన్ దిగివచ్చారు. శ్రీ రామిరెడ్డి తాతగారు పూజ్యశ్రీ అమ్మగారికి నమస్కరించారు. ఇంతమంది మహాత్ములు కీర్తించిన వారి ఆధ్యాత్మికస్థితి ఎంతటి ఉన్నతమైనదో!!

పూజ్యశ్రీ మాస్టరుగారు జ్ఞానసూర్యుడు. ఆయన ఒక విప్లవం—అజ్ఞానాన్ని తన తర్కంతో దహించిన జ్ఞానాగ్ని. తమ వినమ్రతతో ఆ వెలుగును చల్లని అమృతధారగా మార్చి పంచిన జ్ఞాన చంద్రిక పూజ్యశ్రీ

అమ్మగారు. తమ బోధను ఆచరణగా కలిగినవారు పూజ్యశ్రీ మాస్టరుగారు అయితే, తమ ఆచరణే బోధగా జీవించినవారు పూజ్యశ్రీ అమ్మగారు. సాయినాథునికి ఉత్తమ శిష్యులు పూజ్యశ్రీ మాస్టరుగారు అయితే, పూజ్యశ్రీ మాస్టరుగారికి ఉత్తమ శిష్యురాలు పూజ్యశ్రీ అమ్మగారు. అలా వారిరువురి అవతారవిశేషంగా గురుశిష్యపరంపర, గృహస్థధర్మం, పాతివ్రత్యధర్మం పరస్పర అనుసంధానమై పునః ప్రతిష్ఠితమయ్యాయి.

పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగారు ఇద్దరూ ప్రతి విషయంలోనూ ఏకాభిప్రాయం కలిగి వుండేవారు. ఏ విషయంలోనైనా వారిరువురి మధ్య భేదాభిప్రాయం వుండటం ఎప్పుడూ ఎవరూ చూడలేదు. వారి ఇరువురు ఒకరికి ఒకరు ఎంతో స్వేచ్ఛను ఇచ్చేవారు. పరస్పరం ఒకరి అభిప్రాయాలను మరొకరు, ఒకరి స్వేచ్ఛను మరొకరు, ఒకరి వ్యక్తిత్వాన్ని మరొకరు ఎంతో గౌరవించేవారు. ఒకరికొకరు సహకరించుకుంటూ ఇంటికి వచ్చిన భక్తులను ఎంతగానో ఆదరిస్తూ, సాయిని నిరంతరం సేవించుకుంటూ వుండేవారు. ఒకరి అవసరాలను మరొకరు వారు నోరు విప్పి చెప్పక ముందే గుర్తించి సమకూర్చేవారు. సరదాగానైనా ఒకరినొకరు కించపరచుకోవడం గానీ, విమర్శించుకోవడం గానీ, చులకన చేయడం గానీ ఎప్పుడూ చేసేవారు కాదు. ఒకరిగురించి ఒకరు ఎంతో గౌరవంగా మాట్లాడేవారు.

ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు వివాహబంధం గురించి చెప్పిన విషయాన్ని పూజ్యశ్రీ అమ్మగారు ఒక వ్యాసంలో ఇలా వ్రాశారు:

**"భార్యభర్తలు ప్రతి విషయంలోనూ ఏకాభిప్రాయం కలిగివుండాలి. అందుకని ప్రతి విషయాన్ని ఇరువురూ చర్చించుకుని ఒక అభిప్రాయానికి రావాలి. భేదాభిప్రాయం వచ్చినప్పుడు ఒకరితో ఒకరు పోట్లాడుకోకూడదు. నిదానంగా ఒకరి అభిప్రాయాలను మరొకరితో వివరించుకొని వాటిలోని సాధకబాధకాలు ఆలోచించి ఒక నిర్ణయానికి రావాలి. స్నేహితుల వలే కలిసిమెలిసి వుండాలి. ఒకరి భావాలను ఒకరు గౌరవించుకోవాలి. నా మాటే నెగ్గాలని ఇద్దరూ అనుకోకూడదు.**

**భార్యాభర్తలు ఒకరి పొరపాట్లను మరొకరు సరిదిద్దడానికి ప్రయత్నించాలి. అంతేకాక ఇరువురు తమ పొరపాట్లను తాము సర్దుకునే ప్రయత్నం చేయాలి కానీ ఒకరినొకరు సాధించుకోకూడదు. ప్రతి చిన్నదానికి అవతలివారిని తప్పులు ఎంచడం, తిట్టడం ఎప్పుడూ చేయకూడదు.**

**భార్య భర్తను తన సర్వస్వంగా భావించాలి. "నీకు నేనున్నాను! ధర్మేచ, కామేచ, అర్థేచ మోక్షేచ నాతి చరామి!" అని, "ఏ విషయంలోనూ నిన్ను అతిక్రమించి ప్రవర్తించను!" అని వాగ్దానం చేసి భార్యను తన జీవితంలోకి ఆహ్వానిస్తాడు భర్త. భార్య పాలన, పోషణ చేయటమే కాక ఆమెకు మాతృత్వం కలిగే అదృష్టాన్ని ప్రసాదిస్తాడు. జీవితాంతం తోడుగా, నీడగా నేనుంటానని భరోసా ఇస్తాడు. అంటే - భగవంతుని ఏదైతే మనం ప్రార్థిస్తున్నామో దానికి సాకారరూపంగా వాటిని భర్త ప్రసాదిస్తున్నాడు. అందుకని భర్తను భార్య దైవంగా భావించమని పెద్దలు చెప్పారు. సర్వసమర్పణ చేసుకోమన్నారు.**

**అలాగే భార్యను భర్త తనలో సగభాగంగా భావించాలి. అందుకే 'అర్ధాంగి' అన్నారు. అంటే ఆమె లేకపోతే అతను పరిపూర్ణుడు కాడు. తన భర్త కోసం పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను, సోదరీ సోదరులను, అందరినీ విడిచి, భర్తే సర్వస్వం అని తలచి, భర్తకు సంబంధించిన వారే తనవారని భావించి భర్త వెంట భార్య అతనింటికి వస్తుంది. అటువంటి భార్యను ఎంత ప్రేమగా చూసుకోవాలి? అందుకే 'భార్య భర్త పాలిటి దేవత!' అన్నారు పెద్దలు. తనకు అవసరమైన అన్ని సేవలు చేయటమే గాక తనకు తండ్రి అయ్యే అదృష్టాన్ని కూడా కలుగజేస్తుంది భార్య.**

**అందుకే భార్య స్థానం గూర్చి 'కార్యేషు దాసి, కరణేషు మంత్రి..' అంటే 'సేవలు చేయటంలో భార్య దాసి వలే సేవ చేస్తుంది. సలహాలు ఇవ్వడంలో మంత్రి**

**స్థానాన్ని వహిస్తుంది. కడుపునిండా పెట్టడంలో తల్లి స్థానాన్ని భర్తీ చేస్తుంది. శయన విషయంలో రంభ వలే సుఖాన్ని ఇస్తుంది!' అని పెద్దలు చెప్పారు. ఇంతకంటే ఆమె వ్యక్తిత్వాన్ని గూర్చి గొప్పగా చెప్పదగినది ఏమున్నది?**

**అందుకని భార్యాభర్తలు ఇరువురిలో ఎవరూ తక్కువ కాదు, ఎక్కువ కాదు! ఇక ఆ విషయంలో ఒకరినొకరు నిందించుకోవడం ఎంతవరకు సమంజసం?" అని పూజ్యశ్రీ మాస్టరుగారు దంపతులు ఎలా వుండాలో చెప్పేవారు."**

సమర్థసద్గురువు అయిన సాయినాథుడు, శ్రీ పాకలపాటి గురువుగారు అభయం ఇచ్చినట్టు వివాహానంతరం పూజ్యశ్రీ మాస్టరుగారి ఆధ్యాత్మిక జీవితానికి ఆటంకం కలగలేదు సరికదా, పూజ్యశ్రీ అమ్మగారి ఆగమనంతో, సహకారంతో మరింత తీవ్రంగా కొనసాగింది. పూజ్యశ్రీ మాస్టరుగారికి సర్వస్య శరణాగతి చెంది పూజ్యశ్రీ అమ్మగారు వారిని సేవించారు. పూజ్యశ్రీ మాస్టరుగారి దినచర్యలో అవసరమైన ప్రతి చిన్న విషయాన్ని పూజ్యశ్రీ అమ్మగారు ఎంతో శ్రద్ధతో సమకూర్చేవారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు నిరంతరం సాయిసేవలో నిమగ్నులై వచ్చిన భక్తులతో సంభాషిస్తూనో, సత్సంగం చేస్తూనో, గ్రంథాలు చదువుతూనో, రచనలు చేస్తునో విరామం లేకుండా వుండేవారు. ఆయనకు నిద్రాహారాలు పట్టేవి కావు. పూజ్యశ్రీ అమ్మగారు సమయానుకూలంగా వాటన్నిటినీ సమకూర్చి పూజ్యశ్రీ మాస్టరుగారిని హెచ్చరించి నెరవేర్చేవారు. ఆయన కాలకృత్యాలకు వెళ్లే ముందు పళ్ళు తోముకోవడానికి, స్నానం చేయడానికి అవసరమైన వస్తువుల కిట్ సిద్ధంగా వుంచేవారు. ఆ తర్వాత స్నానానికి అవసరమైనటువంటి వస్త్రాలను, తువ్వాలును, సబ్బును సిద్ధంగా వుంచేవారు. ఆయనకు ఏమాత్రం ఇబ్బంది కలగకుండా వారు స్నానం చేసే సమయంలో వారి గదిని, వారు కూర్చునే ఆసనాన్నీ శుభ్రం చేయించేవారు. ఆయన ఆరోగ్యానికి హితకరమైనటువంటి భోజనం సిద్ధం చేయించేవారు. తమ అనారోగ్యం వలన నడవలేకపోతున్నప్పటికీ పూజ్యశ్రీ మాస్టరుగారిని పక్కనే కుర్చీలో కూర్చోబెట్టుకుని భోజనం తామే స్వయంగా వడ్డించేవారు. ఆ తర్వాత తామే స్వయంగా తాంబూలం తయారుచేసి పూజ్యశ్రీ మాస్టరుగారికి ఇచ్చేవారు. పూజ్యశ్రీ మాస్టరుగారికి కాఫీ స్వయంగా తామే కలిపేవారు. పూజ్యశ్రీ మాస్టరుగారు కూడా ఇంట్లో అమ్మగారు ఇచ్చిన కాఫీ మాత్రమే త్రాగేవారు. ఇతరులు ఎప్పుడైనా ఆ సేవ చేసుకోడానికి ప్రయత్నిస్తే వారిని సున్నితంగా వారించి పూజ్యశ్రీ అమ్మగారినే కాఫీ కలపమనేవారు. పూజ్యశ్రీ మాస్టరుగారు అనేక ప్రదేశాలకు, దూర దూర ప్రాంతాలకు వెళ్లి సత్సంగం చేస్తుండేవారు. వారి ప్రయాణానికి అవసరమైనవన్నీ పూజ్యశ్రీ అమ్మగారే దగ్గరుండి చూసుకునేవారు. వారి వస్త్రాలను, వారి వస్తువులను దగ్గరుండి సర్దించేవారు పూజ్యశ్రీ అమ్మగారు. ఎప్పుడూ ఏ ఒక్క వస్తువూ మర్చిపోయారు కాదు. అంత అప్రమత్తంగా, శ్రద్ధగా వుండేవారు పూజ్యశ్రీ అమ్మవారు.

ఒకవంక పూజ్యశ్రీ మాస్టరుగారు అద్భుతమైన రచనలు చేస్తూ వుంటే పూజ్యశ్రీ అమ్మగారు వాటికి మెరుగులు దిద్దుతూ, ప్రూఫ్లు దిద్దుతూ, వ్రాతప్రతులు వ్రాస్తూ విరామం లేకుండా వుండేవారు. మరొక వంక ఏ కూరలు తీసుకోవాలి, ఏ వంటలు చేయించాలి, ఏ వస్తువు ఎక్కడ సర్దించాలి, భక్తులు తీసుకొచ్చినటువంటి ప్రసాదాలను ఎలా సద్వినియోగ పరచాలి – ఇలాంటివన్నీ దగ్గరుండి చూసుకునేవారు. ఒకపక్క మా చదువులు, ఆటలు, ఆసక్తులు గుర్తించి ప్రోత్సహించేవారు. మాకుండే చిన్న చిన్న సరదాలను, మా అభిప్రాయాలను గౌరవిస్తూ ఉత్సాహంగా నెరవేరుస్తూ వుండేవారు. మా చదువుల పట్ల, ఆరోగ్యం పట్ల, ఆటలు, కళల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. మమ్మల్ని ఎంతగానో ప్రోత్సహించేవారు. మమ్మల్ని అనేక వ్యాసరచన, వక్తృత్వ, నాటక, నృత్య పోటీలకు

పంపిస్తూ ఉండేవారు. మమ్మల్ని దత్త క్షేత్రాలకు, మహాత్ముల వద్దకు తీసుకెళ్ళేవారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు గృహస్థ జీవితానికి పరాకాష్ఠ అయితే, పూజ్యశ్రీ అమ్మగారు పాతివ్రత్య ధర్మానికి శిఖరాగ్రం. వీరిద్దరి ప్రేమ కేవలం తమ కుటుంబానికే పరిమితం కాలేదు. 'వసుధైక కుటుంబకమ్' అనే ఆర్షవాక్యానికి నిదర్శనంగా వారి ఇల్లు సాయినాథుని ద్వారకామాయిలాగా నాలుగు పురుషార్థాలనూ జనులకు ప్రసాదించే 'అందరి ఇల్లు' అయింది. ఎందరో ఆర్తులు, అర్థార్థులు, జిజ్ఞాసువులు, ముముక్షువులు దేశ నలుమూలల నుంచి వారి ఇంటికి వస్తూ వుండేవారు. జాతి, కుల, మత, వయోభేదాలకు, ధనిక పేద వ్యత్యాసాలకు, చదువుకున్నవారు, చదువులేనివారు అనే భేదాలకు అతీతంగా ఆ పుణ్య దంపతులు తమ ఇంటికి వచ్చిన వారందరినీ ఆదరించేవారు. ఎవరైనా, ఎన్నిరోజులైనా వారింట్లో గడిపి సాయిని వారితో పాటు సేవించవచ్చు. నిరంతర సత్సాంగత్యంలో వుండవచ్చు. పూజ్యశ్రీ మాస్టరుగారు బ్రహ్మచారిగా వున్నప్పటికంటే ఎక్కువగా పూజ్యశ్రీ అమ్మగారిని వివాహం చేసుకున్న తర్వాత భక్తులలో స్త్రీ పురుషులందరికీ సమానంగా ఆ ఇంటికి వచ్చి ఆ సాన్నిధ్యాన్ని పొందే భాగ్యం కలిగింది.

పూజ్యశ్రీ మాస్టరుగారి జీవితంలో పూజ్యశ్రీ అమ్మగారు ప్రవేశించిన తర్వాత వారి సాయి సేవ మరింత ఉధృతమైంది. పూజ్యశ్రీ అమ్మగారి ఆదరణ వలన ఎంతోమంది వారి ఇంటికి రాసాగారు. రాత్రనకా పగలనకా తరలివచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు చక్కగా వుండేటట్లు, వారి వారి ఆరోగ్యాన్ని, నియమాలను అనుసరించి చక్కటి రుచికరమైన అన్న పానీయాలు వుండేటట్లు పూజ్యశ్రీ అమ్మగారు ఏర్పాట్లు చేసేవారు. వారికి ఏ లోటు లేకుండా హాయిగా వుండేలాగా, వారు సంపూర్ణంగా పూజ్యశ్రీ మాస్టరుగారి సాన్నిధ్యాన్ని సద్వినియోగపరచుకునేలాగా ఎంతో ఉత్సాహంతో అన్నింటినీ చక్కగా అమర్చేవారు. ఇంట్లో ఎప్పుడూ ఎంతో సందడిగా పండుగ వాతావరణం నిండివుండేది. ఇంతటి సందడి వెనుక గాఢమైన ప్రశాంతత అత్యంత నిరాడంబరంగా అందరికీ అనుభవమయ్యేది.

ఆ గురుదంపతులు అహర్నిశలు విసుగు, విరామం లేకుండా వచ్చిన వారందరినీ ఆదరిస్తూనే వుండేవారు. నిరంతరం ఉత్సాహంతో, శ్రద్ధతో సాయిని సేవిస్తూనే వుండేవారు. హారతులు, సత్సంగాలు, భజనలు, సేవలతో ఆ ఇల్లు సాయి సన్నిధిగా ప్రకాశించేది. పూజ్యశ్రీ మాస్టరుగారు ఎన్నో ప్రాంతాలకు వెళ్ళి బాబా ప్రచారం చేసి వస్తూ వుండేవారు. అలాగే ఇంట్లో ఎన్నో పండగలు, ఉత్సవాలు జరుగుతూ వుండేవి. వాటన్నింటిలోనూ ఉధృతంగా సాయి సేవ చేస్తూ ఎంతో ఉత్సాహంగా ఆ దివ్య దంపతులు పాల్గొనేవారు. పూజ్యశ్రీ అమ్మగారి అనారోగ్యం, పూజ్యశ్రీ మాస్టరుగారి నిరుద్యోగం, చిన్నపిల్లలమైన మా బాధ్యత, చదువులు, ఆటలు.. ఇవేవీ ఆ బృహత్తర సేవకు అడ్డు రాలేదు. పూజ్యశ్రీ మాస్టరుగారి ప్రేమపూర్వక పలకరింపుకు పులకిస్తూ పూజ్యశ్రీ అమ్మగారి ఆదరణకు ముగ్ధులై ఇంటికి వచ్చిన వారందరూ వారి అంతులేని ప్రేమలో మునిగితేలేవారు. ఒక వింతైన పారవశ్యంలో రోజులు గడిచిపోయేవి. చిన్నపిల్లలమైన మా పట్ల బాధ్యత, ప్రేమ, వచ్చిన చిన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చక్కని మేళవింపుతో కొనసాగేవి. పిల్లలందరూ తమ తల్లిదండ్రుల కంటే ఎక్కువగా పూజ్యశ్రీ మాస్టరుగారికి, పూజ్యశ్రీ అమ్మగారికి దగ్గరయ్యేవారు. వారిని ప్రాణమిత్రులుగా భావించేవారు. ఆ పిల్లలతో ఆ దంపతులు ఎంతో ప్రేమగా, సరదాగా, ఉత్సాహంగా కబుర్లు చెప్పేవారు. ఆడేవారు కూడా! పిల్లలకు ఎటువంటి నిబంధనలు లేకుండా స్వేచ్ఛగా, హాయిగా వుండనిచ్చేవారు ఆ దంపతులు. అందుకని భక్తుల పిల్లలు కూడా ఎప్పుడెప్పుడు వారివద్దకు వద్దామా అని ఎదురుచూస్తూ వుండేవారు. సెలవులొస్తే వచ్చేవారు కూడా! ఆ పవిత్ర దంపతుల సాన్నిధ్యం వల్ల ఆ పిల్లల హృదయాల్లో భక్తి బీజాలు దృఢంగా నాటుకునేవి.

వారి దాంపత్య జీవితం నల్లేరు మీద నడక

కాదు. ఒకపక్క పూజ్యశ్రీ మాస్టరుగారు చాలా కాలం నిరుద్యోగిగానే కొనసాగవలసి వచ్చింది. అందుకు ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. మరోపక్క పూజ్యశ్రీ అమ్మగారికి వివాహమైన కొంతకాలానికే కీళ్లవ్యాధి వచ్చింది. వారు ఆజన్మాంతమూ మంచానికే పరిమితం కావలసి వచ్చింది. మరోపక్క చిన్నపిల్లలమైన నేను, తమ్ముడు. మా బాధ్యత వుండనే వున్నది. పూజ్యశ్రీ మాస్టరుగారి వల్ల ప్రభావితులై ఆయన నిరంతర సన్నిధిని కోరి ఎంతోమంది వారి వద్దనే స్థిరంగా వుండిపోయారు. అలాగే ప్రతిరోజు ఎంతోమంది భక్తులు వారి వద్దకు వచ్చేవారు. వారందరి స్వభావాలు రకరకాలుగా వుండేవి. అందువలన మానవ సహజమైన బలహీనతలు, అభిప్రాయభేదాలు, వంతులు, కీచులాటలు – వాటన్నిటినీ కూడా ఓర్పుతో సమన్వయపరచవలసి వచ్చేది. పూజ్యశ్రీ మాస్టరుగారు నాస్తికులను, హేతువాదులను చర్చలలో ఓడించారు. కనుక వారి నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొనవలసి వచ్చింది. ఆయన నకిలీ ఆధ్యాత్మికతను, నకిలీ స్వాములను, నకిలీ బాబాలను వ్యతిరేకించారు. కనుక వారి నుండి సమస్యలు ఎదుర్కొనవలసి వచ్చింది. కొందరు రాజకీయ నాయకుల అధర్మాన్ని ప్రశ్నించారు. వారి వలన ఆయన ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. కులమత భేదాలకు అతీతంగా అందర్నీ ఆదరించడం వలన ఛాందసులైన బ్రాహ్మణుల ఆగ్రహానికి గురయ్యారు. తమ కుటుంబంలోనూ, భక్తులలోనూ కులాంతర, మతాంతర వివాహాలను జరిపించడం వలన ఆ వధూవరుల కుటుంబసభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేకతను అనుభవించవలసి వచ్చింది. ఒక్కోసారి భక్తులు పరస్పర విభేదాల వలన వారికి ఎన్నో సమస్యలు తీసుకొచ్చేవారు, తమ సంకుచిత స్వభావాలతో ఇబ్బంది కలిగించేవారు.

కానీ ఇవేవీ ఆ దంపతులను చలింపచేసేవి కావు. వారిని చూస్తే 'ఆ సమస్యలన్నీ వీరికి తెలుస్తున్నాయా? ఇన్ని సమస్యల మధ్య ఇంత ఉత్సాహంగా ఎలా వుండగలుగుతున్నారు?' అన్నట్లుగా ఉండేది వారి ప్రవర్తన. నిరంతరం ఉత్సాహంతో సాయి సేవలో, సాయి భక్తుల సేవలో ఆనందంగా నిమగ్నులై వుండేవారు. వారు జీవితంలోని అన్ని అంశాలను సాయిలీలగా వీక్షించేవారు!! అంతటా తమ సద్గురువునే దర్శించేవారు!! లేకుంటే అలా వుండడం ఎలా సాధ్యం?!

అలా సాయిని స్మరించి, సేవించి, చివరకు ఆ సాయినాథుడే తామై వెలిగిన మన గురుదంపతులు, నేడు సమాధిస్థితులై, నిత్యసత్యులై, శాశ్వతులై, అభయప్రదాతలై భక్తులను ఉద్ధరిస్తూనే వున్నారు. పరిపూర్ణ దత్తవతారమైన, సమర్థ సద్గురువైన సాయినాథులు, మరలా తామే సచ్చిష్య స్వరూపులైన పూజ్యశ్రీ అమ్మగారు, పూజ్యశ్రీ మాస్టరుగారిగా అవతరించి, మన పాలిట సద్గురు దంపతులై నేటికీ మనల్ని వెన్నంటి నడిపిస్తున్నారు. ఆ దివ్య గురుదంపతుల చరణాలను శరణు పొందడమే మన జన్మకు సార్థకత.

సీతారాములు, శివపార్వతుల వలె ఆదర్శప్రాయమైన ఆ గురుదంపతుల గృహస్థ జీవన వైభవాన్ని స్మరించినా, శ్రవణం చేసినా మన జన్మలు పునీతమవుతాయి. నాడు వారి సాన్నిధ్యంలో వుండి, వారి ప్రేమామృతంలో తడిసినవారు నిజంగా ధన్యాత్ములు. నేడు మనము కూడా వారి దివ్యలీలలను స్మరించుకుంటూ, వారి కళ్యాణ వైభవాన్ని మనస్సులలో నింపుకొని, వారి అడుగుజాడల్లో నడవడానికి ప్రయత్నిద్దాం. ఆచంద్రతారార్కము నిలిచివుండే ఆ దివ్య దంపతులు మనపై సర్వదా కరుణావాత్సల్యాలను కురిపిస్తూ, మన కష్టసుఖాల్లో తోడుంటూ, మనకు ఐహిక సుఖాలను మరియు ఆముష్మికముక్తిని ప్రసాదించాలని భక్తితో ప్రార్థించుకుందాం.●

# మాతృదేవి స్మృతులు

శ్రీమతి అంజని, ఒంగోలు

పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి యొక్క అపార కరుణకు అద్దం పడుతున్న సంఘటనలు, భక్తులపట్ల పూజ్యశ్రీ అమ్మగారికి ఉన్న వాత్సల్యం, రక్షణ కవచంలా వారిని కాపాడేతీరు మొదలైన ఎన్నో అనుభవాలను, అనుభూతులను ఒంగోలు వాస్తవ్యురాలు శ్రీమతి అంజని గారు ఈ విధంగా తెలియజేస్తున్నారు.

నేను ఒంగోలు సత్సంగ సభ్యులలో 'అయ్యప్ప'గా పిలువబడే శెట్టిగారి అమ్మాయిని. మా కుటుంబానికి 1986-87 సంవత్సరాలలో పూజ్యశ్రీ మాస్టరుగారితో పరిచయం ఏర్పడింది. అప్పుడు మేమందరం ప్రతి శనివారం పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంట్లో జరిగే సత్సంగానికి హాజరయ్యేవారము. మాకు కొన్ని ఆర్థిక సమస్యలు వుండడం వల్ల పూజ్యశ్రీ మాస్టరుగారి అనుగ్రహంతో నాకు వారి ముద్రణాలయంలో పనిచేసే అవకాశం వచ్చింది. అప్పటికి మాకు పూజ్యశ్రీ అమ్మగారితో చనువు వుండేది కాదు. పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి చెందాక కొంతకాలానికి నా వివాహం జరిగింది. తర్వాత పూజ్యశ్రీ అమ్మగారి అపార కరుణతో, పూజ్యశ్రీ మాస్టరుగారి నిలయంలో పక్కనే వున్న చిన్న ఇంట్లోకి మా అమ్మావాళ్ళు చేరారు. నేను అప్పుడప్పుడు మా పుట్టింటికి వచ్చినప్పుడు పూజ్యశ్రీ అమ్మగారితో బాగా పరిచయం, చనువు ఏర్పడింది. నా కుటుంబంలో వచ్చే ప్రతీ సమస్యను – అది చిన్నదైనా, పెద్దదైనా, పూజ్యశ్రీ అమ్మగారితోనే నేను చెప్పుకునేదానిని.

## ఆరోగ్య సమస్యల్లో మాకు అండగా ఉన్నారు:

ఒకసారి మావారికి కంట్లో వుండే రెటీనా ఇంచుమించు ఊడిపోయినంత పనైంది. అప్పుడు శస్త్రచికిత్స జరిగింది. పూజ్యశ్రీ అమ్మగారు ఆ చికిత్స జరుగుతున్నంతసేపూ నన్ను పారాయణ, పూజ్యశ్రీ మాస్టరుగారికి పూజ చేసుకోమని చెప్పారు. చికిత్స బాగా జరిగి కన్ను బాగైంది. ఆ తర్వాత కొంతకాలానికి మళ్లీ అదే కంటికి శుక్లం వచ్చింది. మావారికి అది ఆ వయసులో రావలసిన సమస్య కాదు. నేను మరలా పూజ్యశ్రీ అమ్మగారి దగ్గరకు వెళ్లి నా సమస్య చెప్పుకున్నాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు మావారిని ప్రతి ఆదివారం పుట్టలో పాలు పోయమని, పాలు పోసే వరకూ ఏమీ తినకూడదని, అలా జీవితాంతం చేయాలని సూచించారు. ఆ ప్రకారం ఇప్పటికీ చేస్తున్నారు. 15 సంవత్సరాల పైగా ఆ శుక్లం పెరగకుండా అలాగే వుంది! ఇది పూజ్యశ్రీ అమ్మగారి దయ కాక మరేమిటి?

## ఆర్థిక మరియు వృత్తిపరమైన ఎదుగుదల

**వ్యాపార విజయం:** మాకు ఒంగోలులో చీరల వ్యాపారం వుండేది. ఆ షాపులో ఉమ్మడిగా మావారు, వారి అన్నదమ్ములు కలిసి వ్యాపారం చేసేవారు. కొంతకాలానికి మేము విడిగా షాపు పెట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. అప్పుడు నాకు ఏం చేయాలో తెలియక పూజ్యశ్రీ అమ్మగారి దగ్గరకు వెళ్లి ఈ విషయం విన్నవించుకున్నాను. పూజ్యశ్రీ అమ్మగారు, "మీరు ఏమీ

భయపడనక్కర్లేదు!" అని చెప్పి నాకు కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆ ప్రకారం మేము మరలా కొత్త షాపు పెట్టుకుని వ్యాపారం చేస్తే, వరుసగా రెండు సంవత్సరములు బాగా వ్యాపారం చేసిన మహిళగా నా పేరు పేపర్లో కూడా వచ్చింది. ఇది నా ప్రతిభ కాదు, వారి దయే!

**గృహ నిర్మాణం:** మేము మరలా మంచి స్థాయికి వచ్చి కొత్త ఇల్లు కూడా కట్టుకున్నాము. ఇదంతా పూజ్యశ్రీ అమ్మగారు చెప్పినట్లు చేయడం వల్లనే సాధ్యపడింది.

ఆ ఇల్లు కట్టుకున్నప్పుడు కూడా సమస్యలు వచ్చాయి. స్లాబ్ వేద్దాం అనుకున్నప్పుడల్లా బాగా మబ్బులు బట్టి వర్షం వస్తుందేమో అనిపించేది. ఇలా జరుగుతూవుంటే నేను పూజ్యశ్రీ అమ్మగారిని ఈ విషయమై ఏదైనా మార్గం చెప్పమని ప్రార్థించాను. పూజ్యశ్రీ అమ్మగారు స్లాబ్ వేసేటప్పుడు ప్రతిసారి శ్రీగురుచరిత్ర ఏకాహ పారాయణ చేయమని చెప్పారు. అంతేకాకుండా ఇల్లు పూర్తయ్యేవరకు ఇష్టమైన పదార్థం వదిలేసి సప్తహ పారాయణ చేయమన్నారు. ఆవిధంగా చేయడం వల్ల ఏ ఇబ్బంది లేకుండా ఆరు స్లాబులు పూర్తి చేసుకున్నాము. మేము ఊహించని చక్కటి ఇంటిని ఎటువంటి అడ్డంకులు లేకుండా నిర్మించుకున్నాము. ఇదంతా పూజ్యశ్రీ అమ్మగారి దయ!

ఒకసారి పూజ్యశ్రీ అమ్మగారు మా తమ్ముడితో, "నువ్వు పెద్ద ఇల్లు కట్టుకుంటావు" అన్నారు. ఇంటి అద్దె కూడా కట్టుకోలేనివాడు ఇల్లు ఎలా కట్టుకుంటాడని మాకు చాలా ఆశ్చర్యమేసింది. కానీ కాలాంతరంలో ఆ మాట అక్షరాలా నిజమైంది!! ఇలాంటి ఎన్నో లీలలు మేము కళ్ళారా చూశాము.

## పిల్లల ప్రవర్తనలో మార్పు

నాకు ఇద్దరు ఆడపిల్లలు. మా అమ్మాయిలు చిన్నప్పుడు బాగా పేచీ పెట్టేవారు. అందులో మా చిన్నమ్మాయి పేచీ పెడితే తట్టుకోవడం చాలా కష్టంగా వుండేది. ఈ విషయం చాలాసార్లు పూజ్యశ్రీ అమ్మగారికి



విన్నవించుకున్నాను. వారు విని ఊరుకునేవారు కానీ ఏమీ చెప్పేవారు కాదు. మా చిన్న పాప పదవ తరగతికి వచ్చినా ఆ సమస్య తీరలేదు. ఇక భరించలేక మరలా పూజ్యశ్రీ అమ్మగారి దగ్గర మొరపెట్టుకున్నాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు మా పాపను తమ దగ్గరకు తీసుకుని రమ్మన్నారు. అలాగే తీసుకెళ్ళాను. పూజ్యశ్రీ అమ్మగారు మా అమ్మాయితో మాట్లాడి నచ్చచెపుతారనుకున్నాను. కానీ వారు మా అమ్మాయితో ఏమీ మాట్లాడలేదు! మౌనంగా వున్నారు! కానీ ఆశ్చర్యం!! పూజ్యశ్రీ అమ్మగారు మౌనంగానే మా అమ్మయిలో మేము ఊహించని మార్పు తీసుకొచ్చారు! ఆ దర్శనం తర్వాత తనంతట తానే అల్లరి, తిక్క పేచీలు మానేసి చక్కగా అర్థం చేసుకోవడం మొదలుపెట్టింది!! నాకెంతో సంతోషం కలిగింది. ఇలా పిల్లల అల్లరి, మొండితనాన్ని కేవలం తన **దర్శన మాత్రంచేత**, ఒక్క మాట కూడా మాట్లాడకుండా **మౌన ముద్రతో** మార్చివేయడం అమ్మగారి ఆధ్యాత్మిక వైభవానికి, వారి సర్వసమర్థతకి,

వాత్సల్యానికి నిదర్శనం.

ఒక్కొక్కసారి మాటల సందర్భంలో పూజ్యశ్రీ అమ్మగారు కొంతమంది వ్యక్తులను చూడకపోయినా కూడా వారి స్వభావాలు చక్కగా చెప్పేవారు! పూజ్యశ్రీ అమ్మగారు సర్వజ్ఞులు!

అందుకే నాకు ఎటువంటి సమస్య వచ్చినా నేను వెంటనే పూజ్యశ్రీ అమ్మగారికి చెప్పేదానిని. వారి ఆదేశాన్ని తప్పక పాటించేదానిని.

పూజ్యశ్రీ అమ్మగారి అనుగ్రహం వల్ల మేము కట్టుకున్న ఇంట్లో మా పిల్లల చదువులు, ఉద్యోగాలు, పెళ్లిళ్లు అన్నీ జరిగాయి. అవన్నీ పూజ్యశ్రీ అమ్మగారి నిర్ణయంతోనే జరిగాయి. మా చిన్న అమ్మాయి పెళ్లి కుదిరాక ఎందుకో మనస్సు చాలా బాధగా వుండేది. ఆ విషయం కూడా నేను పూజ్యశ్రీ అమ్మగారికి విన్నవించుకున్నాను. వారి సూచనలు పాటించగానే ఆ బాధ మటుమాయమైపోయింది!

మా చిన్నమ్మాయి నిశ్చితార్థం జరుగుతున్నప్పుడు కూడా పూజ్యశ్రీ అమ్మగారు మాకు ఏ ఇబ్బంది కలుగకుండా కాపాడారు. మా అమ్మాయి నిశ్చితార్థం ముందురోజున పెద్ద తుఫాను వచ్చి పెళ్లివారు ముహూర్తం సమయానికి అందుకోలేమని, రాకపోకలకు ఇబ్బందిగా వుందని కబురుపెట్టారు. నాకు ఏమీ తోచలేదు. నేను వెంటనే పూజ్యశ్రీ అమ్మగారిని స్మరించుకున్నాను. కాసేపటికి వారి దగ్గరకు ఎవరో వచ్చి, "రాకపోకలకు ఇబ్బంది ఏమీ లేదు, మేము అటునుంచే వస్తున్నాము" అని చెప్పారట! వారు వెంటనే బయలుదేరి నిశ్చితార్థం ఏ సమయంలో జరగాలో ఆ సమయానికి ఇక్కడకు చేరుకున్నారు! అంతా పూజ్యశ్రీ అమ్మగారి లీల!


## ఆపదలో రక్షణ - ప్రాణదాతగా పూజ్యశ్రీ అమ్మగారు

**కారు ప్రమాదం:** మా చిన్నమ్మాయి పెళ్లి పట్టుచీరలకోసం ధర్మవరానికి కార్లో వెళ్తున్నాము. ఇంతలో వున్నట్లుండి కారు ఆగిపోయింది! మాకు కారు ఎందుకు ఆగిపోయిందో తెలియలేదు. ఎంత ప్రయత్నించినా కారు కదలలేదు. చూసుకుంటే కారు ముందు చక్రానికి వున్న నట్లు వదులై, చాలాదూరం నుంచి ఊడిపోతూవున్నాయి. చివరకు కారు ఆగిపోయింది. పక్క నుంచి వెళ్తున్న పోలీసులు ఇది గమనించి చాలా ఆశ్చర్యపోయారు. అంత దూరంనుంచి నట్లు లూజుగా వున్నా మీకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడం చాలా అదృష్టమని చెప్పారు. ఎంతటి ప్రమాదం తప్పిందో! ఇది ముమ్మాటికీ అమ్మగారి అదృశ్య హస్తమే! మా కుటుంబంలోని అందరి ప్రాణాలు కాపాడిన ప్రాణదాత పూజ్యశ్రీ అమ్మగారు!!

**షార్ట్ సర్క్యూట్:** మా అమ్మాయి పెళ్లిరోజున కూడా మాకు పెద్ద ప్రమాదం తప్పింది. పెళ్లి మండపం మీద వున్న ఫోకస్ లైట్ పేలిపోయింది. పెద్ద శబ్దం వచ్చింది. నేను పక్కనే వున్నాను. నా మీద చిన్న నిప్పు రవ్వ పడిందంతే! ఎవ్వరికి ఏ హానీ జరగలేదు! ఆ తర్వాత వీడియో అబ్బాయి వచ్చి, "ఎంత ప్రమాదం తప్పిందో! నిజానికి షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశం వుంది. దేవుని దయవల్ల లైట్ ఒకటే పేలింది, లేకపోతే మండపమంతా కాలిపోయేది" అన్నాడు.

ఇలా మమ్మల్ని అనుక్షణం కంటికి రెప్పలా కాపాడుతున్న పూజ్యశ్రీ అమ్మగారికి ఏవిధంగా కృతజ్ఞతలు తెలుపుకోగలము? పూజ్యశ్రీ అమ్మగారు ప్రసాదించిన సాన్నిహిత్యానికి, రక్షణకు ఏమి చేసి ఋణం తీర్చుకోగలను? మనకు ఏమి చెప్పారో, అలా నడుచుకునే శక్తిసామర్థ్యాలు ప్రసాదించమని పూజ్యశ్రీ అమ్మగారిని మనసారా ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

జై సాయి మాస్టర్!



# సన్నిధానంలో గురు భరద్వాజుని బ్రహ్మానుభూతి పర్వదినం!

శ్రీమతి టి. పద్మావతి

**"అపూర్వ సంగమము**
**అది అద్భుతసంగమము**
**సాయినాథుని భరద్వాజుని అపూర్వసంగమము**
**అది అద్భుత సంగమము"**

అని పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ గురుశిష్యుల మధ్య జరిగిన మహాద్భుత సంఘటనని అత్యద్భుతంగా విరచించారు.

ఫిబ్రవరి 9 బ్రహ్మానుభూతి పర్వదినాన్ని పురస్కరించుకొని పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి దివ్యసన్నిధాన ప్రాంగణమంతా ముందురోజునించే సేవకులు రంగవల్లులతో తీర్చిదిద్ది, పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి రెండువైపులా వారి గురుదేవులు, వారి ధర్మపత్ని కొలువైవుండగా చక్కటి పుష్పమాలికలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ఫిబ్రవరి 9 వుత్సవానికి సంసిద్ధం చేశారు.

ఎప్పటిలాగే ఉదయం ఐదు గంటల ముప్పై నిమిషాలకు మేలుకొలుపుతో సన్నిధానంలో సేవలు మొదలయ్యాయి. కాకడ హారతి, మాతృదేవి సమాధికి ప్రత్యేక అభిషేకం, అనంతరం ఉపాహార నివేదన, అలంకరణ మొదలైన సేవలు కొనసాగాయి. ముందుగా ఇంతటి విశేషమైన రోజున విశేష పూజని గురుపుత్రిక శ్రీమతి వేదమ్మగారు ప్రారంభిస్తూ, "మనకు పూజ్యశ్రీ అమ్మగారు ప్రసాదించిన దీక్షని జనవరి 1వ తేదీ నుంచి, ఈరోజువరకు మండలం రోజులు చేసుకున్నాము. ఆ దీక్ష విరమణ సందర్భంగా ధునిపూజ కూడా చేసుకుందాం. అందరం ఈ విశిష్టతను గుర్తు పెట్టుకొని ఈ స్థానం యొక్క గొప్పతనాన్ని, మనకు దొరికిన మహాత్ముల యొక్క ఔన్నత్యాన్ని అలాగే ఈ సందర్భం యొక్క ప్రాముఖ్యతనీ మనసులో పెట్టుకుని అత్యంత భక్తిశ్రద్ధలతో ఈరోజు కార్యక్రమం జరుపుకుందాం. ఈరోజు మనం చేసేటటువంటి దీక్ష మనందరి జీవితాల్ని దీక్షామయంగా చేసి వారి స్మరణలో పునీతం చేయాలని, మనం అలా ప్రయత్నిస్తామని సంకల్పం చెప్పుకుంటూ ప్రతి ఒక్కరు మీ హృదయంలో మానస పూజ చేసుకుంటే మీ అందరి తరపున నేను ఇక్కడ పూజ చేస్తాను" అంటూ పూజను ప్రారంభించారు. పూజానంతరము ఆరోజు విశిష్టతను తెలియజేస్తూ శ్రీమతి వేదమ్మగారు సత్సంగం చేశారు.

## గురుపుత్రిక శ్రీమతి వేదమ్మగారి సత్సంగము:

సమర్థ సద్గురువైన సాయినాథుడు, తామే సకల దేవతా స్వరూపమని, సకల సాధు స్వరూపమని, జడజీవ పదార్థాల్లో, ఈ విశ్వమందంతటా తామే వున్నామని, పామరులైన వారికి సైతం అనుభవపూర్వకంగా నిరూపించారు. మనం ఎలా ఆలోచించుకోవాలి, ఎలా జీవితంలో సన్మార్గంలో నడుచుకోవాలి, ఏది సన్మార్గమో, ఏది కాదో బోధిస్తూ తమ అవతార కార్యాన్ని శిరిడిలో నిర్వర్తించారు. అనేక మతాల వారు, అనేక కులాల వారు, అనేక జాతులవారు ఆయనను సేవిస్తున్నారు. సకల ధర్మాలకి మూలసూత్రమైనటువంటి 'సాటివారిని నీ వలెనే

ప్రేమించు' అనేదాన్ని సాధించి నేర్చుకోవడం ఎలాగో, దానికి మనలో అడ్డువస్తున్న బలహీనతలు ఏమిటో, వాటిని ఎలా తొలగించుకోవాలో వారి బోధల ద్వారా ఆయన మనందరికీ చెప్పారు, ఆచరించి చూపించారు కూడా! అప్పటి సమకాలికులైన మహాత్ములందరూ వారిని కోహినూర్ వజ్రం వంటి వారని కీర్తించారు. ఎంతోమంది ఆయనను అనుసరిస్తున్నప్పటికీ, "ఎవరు నా శిష్యులనేది? అలాంటివాడు ఒక్కడు కూడా దొరకలేదు!" అని బాబా అన్నారు. ఆయన సమాధి చెందిన తర్వాత చాలాకాలానికి ఒక మహాత్ముడు జన్మించాడు. ఆయనే పూజ్యశ్రీ మాస్టరుగారు!!

చిన్నప్పటినుంచి అన్నిటినీ ప్రశ్నించి తెలుసుకునేటటువంటి ధైర్యం, వివేకం కలిగినటువంటి వ్యక్తిత్వం వున్న మాస్టరుగారు, మనలో వచ్చే ప్రశ్నలే మనల్ని ముందుకు తీసుకువెళ్ళే దారులనీ, దానివల్ల మాత్రమే మనకు వికాసం ఏర్పడుతుందనీ చెప్పేవారు. “నాకు గుడ్డి ఆస్తికుడు కానీ, గుడ్డి నాస్తికుడు కానీ అయితే సంతోషం లేదు, ఎవరైనా, 'ఏది నిజం?', 'మతం ఎందుకు?', 'విజ్ఞాన వీచికలు' అనే గ్రంథాలు చదివిన తర్వాత 'నేను వృత్తేజితుడనయ్యాను, ఆస్తికుడనయిపోయాను' అంటే నాకు ఆనందం లేదు. ఆ గ్రంథాలలో నా ప్రశ్నలకు నాకు వచ్చినటువంటి సమాధానాలు వున్నాయి. అలాగే మీ ప్రశ్నలు మీరు వేసుకొని మీరు చూసుకుంటే మీకు వికాసం కలుగుతుంది" అని చెప్పేవారు.

సహజంగా మనలో, వున్నదానితో అసంతృప్తి లేని దేనికోసమో తపనగా వ్యక్తమయ్యేటటువంటి మోక్షకాంక్ష, అంటే, ఎప్పుడూ హాయిగా, తృప్తిగా, శాంతిగా ఆనందంగా జీవితం వుండాలని మనం జీవితాంతం శ్రమిస్తూ, అసలు అది దొరకకుండానే ముసలివాళ్ళమై చనిపోతున్నాం. అట్లాంటి 'స్థితి' కోసం చేసే ప్రయత్నంలో, అనేక ప్రశ్నలు వేసుకుంటూ, సమాధానం కోసం జీవితాన్ని రూపుదిద్దుకుంటూ పోతున్నాం. ఆ ప్రయత్నం ఏదైతే మనలో వుందో దాన్ని పవిత్రంగా, స్వచ్ఛంగా, నిజాయితీగా వుంచుకోవడం చాలా ముఖ్యం. దాన్నుంచి మనకు వికాసం కలుగుతుంది. అందుకనే పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన సూక్తి ఏంటంటే, "క్షణ క్షణము ఆత్మవికాసానికై కృషి చేయడమే మానవ జీవిత లక్ష్యం కావాలి" అని. ఆత్మవికాసం ఎలా వస్తుంది? మనకున్న గందరగోళం నుంచి ప్రశ్నలు వేసుకొని దాని సమాధానాలు కోసం తరచినప్పుడు కలుగుతుంది. అందుకని ప్రశ్నించడం తప్పు అనుకోవడం సరైనది కాదు. ఎప్పుడు ప్రశ్నించామో అప్పుడు వికాసం చెందుతాము. దానికి వివేకం, వైరాగ్యం చాలా ముఖ్యం. అటువంటి ప్రత్యేక లక్షణాలు కలిగి జన్మించినటువంటి మహాత్ములు పూజ్యశ్రీ మాస్టరుగారు!!

అపర విజ్ఞానవేత్త, పరమ వైరాగ్యపురుషుడైన తండ్రి దగ్గర శిక్షణ పొందుతూ, చివరికి వుపనయనం చేసుకునే వయసు వచ్చేసరికి 'ఎందుకు ఉపనయనం చేసుకోవాలి?' అన్న ప్రశ్న వారికి ఉదయించింది. ఉపనయనం చేసుకున్న వారికి, చేసుకోని వారికి తేడా ఏమీ లేదు. అందరూ ఒకేలా వున్నారు. 'అసలు ఉపనయనంలో ఏముంది?' అని ప్రశ్నలు వేస్తూ అందరిని అడుగుతూ వుండేవారు. చివరకు తృప్తికరమైన సమాధానం రాకపోతే, 'అందులో ఏముందో మనమే తెలుసుకుంటే సరిపోతుంది కదా!' అనిపించి ఉపనయనం చేసుకున్నారు. అంటే ఎవరి నుంచీ సరైన సమాధానం దొరకకపోయేసరికి అలాంటి సత్యాన్వేషిని ప్రకృతి లేదా భగవంతుడు లేదా సద్గురువు ఎలా మలుస్తారో చూడండి.

ఒక మహాద్భుతమైన ముహూర్తం నిర్ణయింపబడింది. ఆ ముహూర్తం రోజున ఉదయం, వారికి చాలా ఇష్టమైన అన్నగారి కుమారుడు అస్వస్థతకు గురై, గాయత్రి మంత్రం ఉపదేశించే శుభముహూర్తంలో మరణించాడు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారికి మొత్తం ప్రశ్నలే! 'అదేమిటి నిన్నటిదాకా బాగున్న పిల్లవాడు, ఈరోజు వడదెబ్బ కొట్టి చనిపోవడం ఏమిటి? జీవితం మన అధీనంలో లేదా? అసలు జీవితాన్ని ఇలా మలుస్తున్న ప్రకృతి యొక్క ధర్మం ఏమిటి? అసలు మరణించడం అంటే ఏమిటి? పుట్టడం అంటే ఏమిటి?' మొదలైన ప్రశ్నలు వచ్చాయి. మనకు కూడా ఇలాంటి ప్రశ్నలు వస్తూ వుంటాయి కానీ

వాటిని తేల్చుకోము. అయితే పూజ్యశ్రీ మాస్టరుగారు ఆ ప్రశ్నలనన్నింటిని అన్వేషిస్తూ, అన్వేషకుడిగా కొనసాగి, తన మీద వున్న ప్రభావాలన్నింటినీ తొలగించుకొంటూ ముందుకుసాగారు. ఒకపక్క తన నిత్యజీవితంలో జరగవలసిన చదువు, వుద్యోగం మొదలైనవన్నీ చేసుకుంటున్నప్పటికీ, మనసులో మాత్రం అన్వేషణ కొనసాగుతోంది. చదువయ్యాక చాలా చిన్న వయసులో ఒంగోలులో వుద్యోగంలో చేరారు. చివరికి అన్వేషణ చాలాకాలం కొనసాగి, ఒంగోలులో ఊరి బయట నడుస్తుండగా తలలో పెద్ద శబ్దమై విపరీతమైన శాంతి అనుభవమయింది. ఆ శాంతి ముందు అన్నీ అప్రస్తుతం అనిపించాయి. తర్వాత ఆ ప్రశ్నలన్నిటికి సమాధానం కూడా దొరికింది. 'భగవంతుడు వున్నాడు' అనేటటువంటి నిరూపణతో కూడిన ఒక సిద్ధాంతం రూపుదిద్దుకుంది.

అయినా తనకు నిరూపించబడినటువంటి సిద్ధాంతం నిజమా కాదా అని తెలుసుకోవడానికి పూజ్యశ్రీ మాస్టరుగారు అనేక మత గ్రంథాల్ని, అనేకమంది శాస్త్రవేత్తల, హేతువాదుల, నాస్తికుల పుస్తకాలను చదివారు. ఎక్కడా వారి అభిప్రాయాలు మార్చుకోవాల్సిన అవసరమే రాలేదు. దాంతో పాటు ఒక విషయం తెలిసింది. ఎంతటి శాస్త్రవేత్తలచే నిరూపించబడిన విషయమైనా సరే, మన మనసుని ఆ స్థాయికి తీసుకెళ్లగలిగితే మనకు కూడా ఆ విషయాలు తడతాయి అని!! ప్రతి మనిషికి ఆ సామర్థ్యం వున్నదని అర్థమైంది.

ఒకసారి వారి అన్నగారైన వేదవ్యాస్ గారు పూజ్యశ్రీ మాస్టరుగారిని శిరిడి వెళదాం రమ్మన్నారు. "నాకు అర్హత వుంటే భగవంతుడి కృప ఎక్కడైనా లభిస్తుంది. నాకు అర్హత లేకపోతే శిరిడికి వెళ్లినా ఏమీ రాదు" అని వాళ్ళ అన్నగారితో చెప్పారట. "నాకు తోడుగా రా, అక్కడ తెలుగు మాట్లాడే వారు ఎవరూ లేరు" అనంటే, అయితే సరేనని వెళ్లారు. ఫిబ్రవరి 8వ తారీకు సాయంత్రం మొట్టమొదటిసారి బాబా దగ్గరికి పూజ్యశ్రీ మాస్టరుగారు వెళ్లారు. ఆ సమయంలో సాయంత్రం హారతి జరుగుతోంది. సమాధి చెందిన చాలా రోజుల తరవాత కూడా అంత నమ్మకంతో ప్రార్థిస్తున్నవారిని చూసి చాలా ఆశ్చర్యం వేసింది. ఎదురుగా వున్న అరుగు చూపించి, అదేమిటని అడిగారు. "అది బాబా సమాధి దాంట్లో బాబా శరీరాన్ని వుంచారు" అని వేదవ్యాస్ గారు చెప్పగానే, "ఇన్ని సంవత్సరాలు అయిపోయింది కదా, ఆ శరీరం ఎంతగా కుళ్లిపోయి వుంటుందో! దాని వాసన బయటకు రాకుండా వుండడం కోసం ధూపాలు వేసి వుంటారు" అనిపించి, తీవ్రంగా కడుపులో తిప్పి ఏమీ తినకుండా తన బసకు వెళ్లి పడుకున్నారు.

ఉదయం లేవగానే బాగా ఆకలివేసి మద్రాస్ హోటల్లో టిఫిను తినడానికి మందిరం లోనించి అటువైపు వెడుతూ, ఒకసారి అక్కడి పరిసరాలు చూశారు. హాలంతా ఖాళీగా వుంది. అప్పుడే అభిషేకం పూర్తయ్యినట్లుంది, జీవకళతో కళకళ లాడుతున్న బాబా విగ్రహాన్ని మరొక్కసారి చూడాలనిపించి, అలా దగ్గరికి వెళ్ళి అక్కడున్న స్థంభాన్ని ఆనుకుని నిల్చుని చూశారు. బాబా వైపు చూస్తూ 'అసలు ఈయన ఏమై వుంటారు?' అని అంచనా వేయడానికి ప్రయత్నించారు. వెంటనే, 'ఇఫ్ యు లుక్ టు మీ, ఐ లుక్ టు యు' **(If you look to me, I look to you)** అన్నదానికి ఒక నిదర్శనంగా, పూజ్యశ్రీ మాస్టరుగారు ఎలా చూసారో బాబా అలా ప్రకటమయ్యారు! 'ఏంటిది?' అని చూసినప్పుడు ఆయన ఏమిటో చూపించారు. ఆయన తత్వం ఏమయి వుంటుందని చాలా నిజాయితీగా చూసిన భక్తుడికి చాలా నిజాయితీగా సమాధానం చెప్పారు. ఈ సృష్టి అంతా వారై వుండటం అందులో తానొక భాగమై వుండడం అనిపించి అదొక భావంగా మొదలై అనుభూతిగా మారిపోయింది. వారికి అసలు సమయమే తెలియలేదు. అక్కడినుంచి పూజ్యశ్రీ మాస్టరుగారి తత్వం, తీరు, మొత్తం మారిపోయాయి. ఆ తర్వాత ఒక మహాత్ముని సామర్థ్యం ఏమిటి? స్వశక్తితో పైకి వచ్చిన వారికి మహాత్ములు ఎందుకు అవసరం? మహాత్ములను ఆశ్రయిస్తే వారెంత చేయగలరు? అన్నది అనుభవపూర్వకంగా అర్థమైంది. ఆయన గురించి తెలుసుకుంటున్న కొద్దీ ఇంకా ఆనందంగా వుండడం మొదలైంది. అందుకని వారికి సంబంధించిన

విషయాలన్నీ విపరీతంగా సేకరించడం మొదలుపెట్టారు. అంతేకాదు, వీలున్నప్పుడల్లా శిరిడీకి వెళ్లేవారు. బాబాను చూసిన వారందరూ ఎక్కడెక్కడ వున్నారో వెతికి వారి దగ్గరికి వెళ్లి బాబా గురించి అనుభవాలు సేకరించేవారు. పూజ్యశ్రీ మాస్టరుగారు చాలా నిజాయితీగా వారి దగ్గరికి వెళ్లేవారు. అత్యంత వినయ విధేయతలతో వుండేవారు, వివేకంతో వుండేవారు. ఆయన వ్యక్తిత్వానికి ప్రతివారు ముగ్ధులయ్యేవారు.

అలా పూజ్యశ్రీ మాస్టరుగారు చాలాకాలం శ్రమించి బాబా గురించి వివరాలు తెలుసుకున్నారు. అలా బాబా గురించి తెలుసుకునే ప్రయత్నంలో సత్సంగంకూడా మొదలైంది. అలా సత్సంగం నడుస్తున్నప్పుడు, 'సమాధి అనంతరం ఇంతటి అనుభూతి కలిగింది కదా, సశరీరంగా మిమ్మల్ని చూసి వుంటే ఎంత బాగుండేదో! కనుక ఇప్పుడు అటువంటి మహాత్ముల దర్శనం నాకు ప్రసాదించండి' అని పూజ్యశ్రీ మాస్టరుగారు బాబాను ప్రార్థించారు. అలా ఎంతోమందిని దర్శిస్తూ పూజ్యశ్రీ మాస్టరుగారు ఆనందమయీ మాత దగ్గరికి వెళ్లారు. అక్కడ అఖండానంద సరస్వతిస్వామి భాగవత సప్తాహం చేస్తున్నారు. వారు "సమాధి చెందిన మహాత్ములు ఉద్ధరించలేరు, సశరీరులైన వారిని ఆశ్రయించాలి" అని చెప్పారు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారికి సందేహం వచ్చింది. ఇంతవరకు వారు ఎంతోమంది మహాత్ములను దర్శించారు కానీ బాబా దగ్గరికి వెళ్లినప్పుడు కలిగిన అనుభూతి వారికి ఎక్కడా కలగలేదు. మరి ఆయన సశరీరంగా లేరుకదా సద్గురువుగా తీసుకోవచ్చా, లేదా అనిపించి శిరిడి వచ్చి మరలా బాబాను ప్రార్థించారు. అంతేకాదు మహాత్ముల దర్శనం కోసం తిరగడంలో ఆయన ఎంతో నకిలీ ఆధ్యాత్మికతని కూడా చూశారు. అక్కడక్కడ నిజమైన మహాత్ములు వున్నారు. వేల కొద్దీ వంచకులు వున్నారు దానివల్ల ఎంతోమంది వారి బలహీనతలకు బలైపోతున్నారు. అది చూసి పూజ్యశ్రీ మాస్టరుగారికి చాలా బాధ కలిగింది. నిర్దిష్టంగా సద్గురుని తెలుసుకొని, సేవించి, తరించే మార్గమే లేదా? అనే ప్రశ్న మొదలై అటువైపు కూడా అన్వేషణ జరిగేది. దీన్నంతటినీ బాబా ముందు పెట్టారు పూజ్యశ్రీ మాస్టరుగారు.

దానికి సమాధానంగా బాబా పూజ్యశ్రీ మాస్టరుగారిని పూనా పంపించారు. అక్కడ గుళవణి మహరాజ్ గారిని దర్శించారు. వారు పూజ్యశ్రీ మాస్టరుగారిని చూస్తూనే, "సాయిబాబా కా బేటా!" అని పిలుస్తారు. వారికి గురుచరిత్ర గ్రంథాన్ని ప్రసాదించి "దీనిని పారాయణ చేస్తే సాక్షాత్తు దత్తాత్రేయుడు మన గురువెవరో తెలియచేస్తారు. కనుక ఎవరికీ తల తాకట్టు పెట్టాల్సిన అవసరం లేదు. సద్గురువు ఎలా వుంటారో తెలుసుకుని, సేవించి తరించే మార్గం ఈ గ్రంథంలో వుంది" అని గురుచరిత్ర గ్రంథం గురించి చెప్పారు. ఆ గ్రంథం సంస్కృతంలో వుంటే దాన్ని తెలుగులోకి అనువదించి మనందరికీ అందించారు పూజ్యశ్రీ మాస్టరుగారు. శిరిడీలో అంతటి అనుభవం పొందినా, నా గురువెవరో తెలపమని పూజ్యశ్రీ మాస్టరుగారు శ్రీ గురుచరిత్ర పారాయణ చేశారు. అప్పుడు సాక్షాత్తు శిరిడీ సాయినాథుడు దర్శనమిచ్చి "నీకు గురువు లేరని బాధపడతావెందుకు? నేనున్నాను!" అని మూడుసార్లు చెప్పారు. అలా బాబా అంగీకరించిన నిజమైన శిష్యుడు పూజ్యశ్రీ మాస్టరుగారు!! అలా 'గురువు దొరికిన తర్వాత వారికి సర్వ సమర్పణ చేసుకుని తన జీవితాన్ని నడుపుతాడు శిష్యుడు' అన్నదానికి నిదర్శనం మన మాస్టరుగారి జీవితమంతా!

అక్కడి నుంచి వివాహ విషయంలో వారికి మరో పార్శ్వమైనారు పూజ్యశ్రీ అమ్మగారు. వారిద్దరూ పరస్పరం బాబా సాంప్రదాయమనే రథానికి రెండు చక్రాలుగా వుండి, మనందరం ఎలా నడవాలో నేర్పించి, సరైన మార్గాన్ని చూపించే గొప్ప శిష్యులుగా, గొప్ప మహాత్ములుగా మనకు సద్గురు దంపతులుగా లభించారు. అప్పటినుంచి ఇప్పటివరకు జరిగిన మొత్తం లీలలో మనం ఈరోజు ఇక్కడ కూర్చుని వారిని గురించి స్మరించుకోవడం వారి కృప తప్ప మరొకటి కాదు. అదెంతటి అవకాశమో గుర్తుపెట్టుకుని, దాన్నంతటిని మనసులో నిలుపుకొని, అతి పవిత్రమైనటువంటి

***మిగతా 27వ పేజీలో***

# ద్వారకామాయి అనుభవమండపము

***శ్రీ గిరికుమార్, ఒంగోలు***

మా నాన్నగారు పంచాయతీరాజ్ ఈవోగా విజయవాడలో పనిచేసేవారు. నేను 1978–81 సంవత్సరములలో గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయంలో M.Com పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాను. 1983 వ సంవత్సరం నవంబర్లో హైదరాబాదులో ఉద్యోగ అవకాశం వచ్చింది. సరిగ్గా ఉద్యోగంలో చేరే రోజు మా నాన్నగారు గుండెపోటుతో కన్నుమూశారు. ఆ రోజు నేను చేరక పోవడం వల్ల ఉద్యోగం పోయింది. దానికన్నా మా నాన్నగారి మరణం నన్ను బాగా కృంగదీసింది. మేము ఆరుగురు సంతానం. నాకు ఐదుగురు చెల్లెళ్లు. మా కుటుంబానికి మా నాన్నగారి ఉద్యోగమే ఆధారం. ఇతరత్రా ఆస్తులు ఏమీ లేవు. మా నాన్నగారి మరణంతో మా కుటుంబ పరిస్థితి చాలా అయోమయంలో పడిపోయింది. ఉద్యోగం లేని నేను ఆ కుటుంబాన్ని ఎలా పోషించాలన్న ఆలోచనలతో మానసికంగా చాలా కృంగిపోయాను. మా నాన్నగారు పోయేటప్పటికే మా పెద్ద చెల్లి పెళ్లి కుదిరింది. తీరా పెళ్లి చేద్దామనే సరికి ఇలా అయింది. తను "అన్నయ్యా నువ్వు పెళ్లి చేసుకుంటే నువ్వు, వదిన తర్వాత నాకు పెళ్ళిచెయ్యొచ్చు. కనుక నువ్వు పెళ్లి చేసుకో" అని చెప్పింది. ఇక తప్పని పరిస్థితుల్లో 1984 జనవరిలో నేను వివాహం చేసుకున్నాను.

ఒకసారి నాకు 104° జ్వరం వచ్చింది. బాగా నీరసపడిపోయాను. అప్పుడప్పుడే జ్వరం కొద్దిగా తగ్గుముఖం పడుతున్న సమయంలో మా బావమరిది వచ్చి, తను విజయవాడలో స్టెల్లా కాలేజీ దగ్గర ఉన్న బాబా గుడికి వెళుతున్నానని, నన్ను కూడా రమ్మని పిలిచాడు. నాకు బాగా నీరసంగా వుంది పైగా ఈ బాబాలు అంటే అంత నమ్మకం లేదు. అదే విషయం అతనితో చెప్తూ, "మా ఇంటి ఇలవేల్పు వెంకటేశ్వర స్వామి. మంచైనా, చెడైనా ఆయనే మాకు దైవం. నాకు ఇంకెవరి మీద నమ్మకం లేదు. నేను రాను" అని చెప్పాను. "అలా కాదు బావగారు, అక్కడ హోమం జరుగుతోంది. ధునిలో టెంకాయ వేసుకుని వద్దాం. సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది" అన్నాడు. (నాకు అప్పటికి ఇంకా సరైన ఉద్యోగం దొరకలేదు). "వెంకటేశ్వర స్వామి నా దైవం కదా, ఆయన చేయనిది ఈయన ఏమైనా చేస్తాడా? నేను రాను" అన్నాను. మొత్తానికి కొంత వాదనయ్యాక అతని మాట కాదనలేక నమ్మకం లేకపోయినా బాబా గుడికి వెళ్లాను.

అక్కడికి వెళ్ళాక, "నేను బయట నిల్చుంటాను నువ్వు లోపలికెళ్ళి దణ్ణం పెట్టుకుని రా" అని చెప్పాను. సరేలే అని అతను లోపలికి వెళ్ళాడు. కానీ కొంతసేపటికి నాకు తెలియకుండానే నేను కూడా లోపలికి వెళ్లాను. అక్కడ ఒక స్తంభానికి ఆనుకుని చేతులు కట్టుకొని

బాబాగారి విగ్రహం చూస్తున్నాను. ఉన్నట్లుండి విగ్రహం నుంచి బాబా బయటికి వచ్చి, నేను నిల్చున్న చోటికి వచ్చారు. నాకు మతిపోయినంత పని అయింది!! బాబా ఇలా రావడం ఏమిటని చుట్టూ చూశాను. అందరూ ఎవరిమానాన్న వాళ్ళు బాబా విగ్రహానికి నమస్కారం చేసుకుంటున్నారు. బాబా నాతో "ఏం బిడ్డా! మీ నాన్న పోయాడని ఎందుకంత బాధపడుతున్నావు? ఆయన సమయం అయిపోయింది వచ్చేసాడు. మీ నాన్న ఎక్కడికీ పోలేదు నా దగ్గరే ఉన్నాడు, చూస్తావా? అని అడిగారు. 'చూపించండి బాబా' అన్నట్లు తలవూపాను. ఆశ్చర్యంగా ఆయన తన చేతిని గాల్లోకి ఊపారు, పక్క గోడ మీద సినిమాలో తెరలాగా వచ్చి, దానిమీద బొమ్మ వచ్చింది. అది శిరిడి! అక్కడ మా నాన్న ఒక తోటలో మొక్కలకు నీళ్లు పోస్తున్నారు. నేను ఆశ్చర్యపోయాను. "మా నాన్న మీ దగ్గర వున్నారేంటి? ఇలా చేసారేంటి బాబా? మేమంతా చిన్న పిల్లలం, ఇప్పుడు మా పరిస్థితి ఏంటి?" అని అడిగాను. "ఆయనకి అంతే ఆయుష్షు ఉందిరా, నువ్వేమీ బాధపడకు. నీకు నేనున్నాను. ఆ ఉద్యోగం కూడా నేనే తప్పించాను. నీ చేత వ్యాపారం చేయిస్తాను. నీకు అంతా బాగుంటుంది. నేను చెప్పిన మార్గంలో వెళ్ళు" అని చెప్పారు. అప్పుడు నేను "బాబా నాకు ఇవన్నీ నమ్మకం లేదు. మా కులదైవం వేంకటేశ్వర స్వామి. ఆయన మీదే నాకు నమ్మకం" అన్నాను. అప్పుడు బాబా, "మీ వేంకటేశ్వర స్వామిని నేనే చూడు" అన్నారు. ఆయన వేంకటేశ్వర స్వామిలా మారిపోయారు నేను ఆశ్చర్యపోయాను. "ఇంకా ఏయే రూపాయలు కావాలి?" అని అడిగారు. 'రాముడు' అన్నాను. అలాగే చూపించారు, దశావతారాలు మొత్తం చూపించారు. నేను అలా ఆశ్చర్యంగా చూస్తూ ఉన్నాను. అప్పుడు బాబా, "ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో ఫలానా రోజున నువ్వు బొకారో ఎక్స్ ప్రెస్ లో ఒంగోలు వెళ్ళు, అది ప్రతి రోజూ రాత్రి 10:30 కి వస్తుంది, కానీ నువ్వు వెళ్లే రోజు 11:30 కి వస్తుంది. ఒంగోలు తెల్లవారుజామున గం॥3.50 ని॥లకు వెళుతుంది. ఆ తర్వాత విషయం నేను నడిపిస్తాను. నీకు చివరికంటా తోడుంటాను" అనిచెప్పి, ఆయన అదృశ్యం అయిపోయారు. నాకు మతిపోయింది. ఆయన మీద కొంచెం గురి కుదిరింది.

ఇంతలో మా బావమరిది వచ్చి, నన్ను భుజం మీద తట్టి, 'ఏమిటి అలా ఉండిపోయావు' అంటున్నాడు. నేను ఒక స్తంభానికి ఆనుకుని నిలుచున్నవాడిని అలాగే ఉండిపోయాను. మా బావమరిది తట్టేసరికి ఈ లోకంలోకి వచ్చి, జరిగింది అంతా చెప్పాను. తను ఒకటే ఆశ్చర్యపోయి, "అలా ఎవరికీ జరగదు. ఇదంతా నీ భ్రమా! నిజమా!" అన్నాడు. నేను బాగా జ్వరంతో ఉండడం వల్ల అలా జరిగిందేమోనని తన అనుమానం. 'భ్రమ కాదు అంతా నిజమే. నేను వెళ్ళవలసిన ఊరు తేది ఎక్కవలసిన రైలు అన్నీ స్పష్టంగా చెప్పారుకదా!" అన్నాను. సరే చూద్దాం అన్నాడు.

ఇంటికి వెళ్ళాక ఈ సంగతి మా ఇంట్లో వాళ్లకి, నా స్నేహితులకు చెప్తే ఎవరూ నమ్మలేదు. అదంతా నా భ్రమ అన్నారు. ఇది 1986 వ సంవత్సరంలో జరిగింది. నేను బాబా చెప్పినట్లు ఒంగోలు వెళ్లవలసిన రోజు రానే వచ్చింది. నేను వెళతానంటే మా ఇంట్లో వాళ్ళు ఒప్పుకోలేదు. "ఆ ముస్లిం దేవుడిని నమ్మి ఏదేదో చేస్తున్నావు, మన ఇంటి ఇలవేల్పు వేంకటేశ్వర స్వామి ఉండగా నీకు ఇవన్నీ ఎందుకు?" అని ఒకటే గోల! కానీ నేను మాత్రం ఆయన చెప్పింది నిజమవుతుందా లేదా తెలుసుకోవడానికి అయినా వెళ్లాలనుకుని రైల్వే స్టేషన్ కి బయలుదేరాను. బాబాగారు అన్నట్లే, పదిన్నరకు రావలసిన బొకారో ఎక్స్ ప్రెస్ ఆరోజు 11:30 కి వచ్చింది. నాకు అప్పటికే చెమటలు పడుతున్నాయి. ఎన్నో రోజుల ముందుగానే ఇంత ఖచ్చితంగా రైలు వేళలు కూడా ఎలా చెప్పగలిగారా? అనిపించింది. వారు చెప్పినట్లుగానే తెల్లవారుజామున 3:50కి ఒంగోలులో దిగాను. శర్మ కాలేజీ పక్కన హౌసింగ్ బోర్డ్ క్వార్టర్స్ లో మా పిన్న మావగారు ఉంటారు. వాళ్ళ ఇంటికి వెళ్ళాను. ఆయన నన్ను చూసి ఆశ్చర్యపోయారు. విషయం అంతా చెప్పాను. తెల్లవారేసరికి మా

బావమరిది వచ్చాడు. బాబా నన్ను ఎందుకు ఒంగోలు వెళ్ళమన్నారో తెలియలేదు.

ఆ రోజు సాయంత్రం మా బావమరిది, మా పిన్న మామగారు, నేను అలా బజారుకి వెళ్ళాం. మేము పత్తివాడ వీధిలోంచి నడుస్తున్నాం. అక్కడ భూమిశెట్టి హనుమంతరావుగారని పెద్ద వ్యాపారస్తులు. వారివి రెండు హోల్ సేల్ షాపులు ఉన్నాయి. ఒకటి ఎలక్ట్రికల్ షాపు, ఇంకొకటి పెయింట్స్ షాపు. వారికి మా బావమరిది తెలుసు. ఇదివరకు మా బావమరిదివాళ్ళు ఒంగోలులోనే ఉండి ఇప్పుడు విజయవాడ వెళ్ళిపోయారు. ఆ పరిచయంతో బొమ్మిశెట్టి హనుమంతరావుగారు మా బావమరిదిని పలకరించి షాపులోకి రమ్మన్నారు. మేము ముగ్గురం షాపులోకి వెళ్లి కూర్చున్నాం. వాళ్ళిద్దరూ మాట్లాడుకున్నాక వారు నా గురించి అడిగారు. మా బావమరిది నన్ను పరిచయం చేశాడు. ఏం చేస్తున్నారని నన్ను అడిగారు. "ఉద్యోగ ప్రయత్నాలు చాలా చేశాను, సరైనది దొరకలేదు, ఇప్పుడు ఏదైనా చిన్న వ్యాపారం చేయాలనుకుంటున్నా" నని చెప్పాను.

ఆయన కొంతసేపు కళ్ళుమూసుకుని మౌనంగా ఉండి, "ఈ రెండు షాపులు మావే, ఈ ఎలక్ట్రికల్ షాపు మీకు ఇస్తాను చేసుకోండి" అన్నారు. నేను ఆశ్చర్యపోయాను. ఇది నిజమా! కలా! అర్థం కావడం లేదు. అప్పుడు ఆయనే ఇలా అన్నారు: "ఈ షాపు మా చిన్నబ్బాయి చూసుకుంటున్నాడు. పక్క షాపు మా పెద్దబ్బాయి చూసుకుంటున్నాడు. మాకు ఈ వ్యాపారం మరొకరికి ఇవ్వవలసిన అవసరం లేదు. కానీ నా మనసులో ఇప్పుడే మా కులదైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి, ఈ షాపు మీకు ఇవ్వమని, చాలా అవసరమని చెప్పారు. అది వారి 'ఆజ్ఞ' అని కూడా చెప్పారు. ఆ మాట మీద మీకు ఇస్తున్నాను" అన్నారు. నాకు చాలా ఆశ్చర్యం వేసి, "సార్! మీరిచ్చినా నాకు ఈ షాపు కొనే స్తోమత లేదు. నాకు తగిన చిన్న వ్యాపారం నేను చేసుకుంటాను" అన్నాను కొంత అభిమానపడుతూ. "అయ్యో! నేను వేరేవిధంగా అనలేదు. నిజంగానే చెబుతున్నాను. నేను స్వామివారి ఆజ్ఞను జవదాటను" అన్నారు. నేను నెమ్మదిగా, "సార్! ఈ షాపులో స్టాక్ ఎంత ఉంటుంది?" అని అడిగాను. 10 లక్షలు అన్నారు. వెంటనే "అమ్మో! నా దగ్గర అంత డబ్బు లేదు, ఈ వ్యాపారం నాకు ఒద్దు" అన్నాను. "సరే ఒక ఒప్పందం మీద ఈ షాపు మీకు ఇస్తాను. ఇంతకీ మీ దగ్గర ఎంత డబ్బు ఉంది?" అన్నారు. '80,000/- ఉన్నాయి సార్' అన్నాను. "ఏమీ ఫరవాలేదు, ఈ స్టాక్స్ మొత్తం నీ పేరన అకౌంట్స్ రాసి పెడతాను. ఇవ్వగలిగింది ఇప్పుడు ఇవ్వండి. మిగతాది నోటు రాసి ఇవ్వండి. మూడు సంవత్సరాల దాకా మీరు మాకు ఏమీ ఇవ్వనవసరం లేదు. మూడు సంవత్సరములు తర్వాత బాకీ తీర్చుకోండి" అన్నారు. మాకు ఏమనాలో అర్థం కావడం లేదు. మా బావమరిది, "మేము మళ్ళీ వారం పది రోజుల్లో వస్తాం, ఏ సంగతి చెప్తాము" అన్నాడు. "ఈ క్షణం నుంచి మా షాపు మీ బావగారిది. రేపటి నుంచి అకౌంట్స్ అన్ని వారి పేరు మీద రాసి పెడతాము. మీరు ఎప్పుడు వచ్చినా మీకు అప్పచెబుతాము" అన్నారు. మేము వారి వద్ద సెలవు తీసుకొని బయటపడ్డాము. మా ముగ్గురికి అంతా అద్భుతంగా ఉంది. ఇలాంటి సన్నివేశాలు సినిమాల్లో కూడా జరగవేమో! బాబాగారు నన్ను ఒంగోలు వెళ్ళమని ఇంత మహాత్మ్యం చూపించారు, ఆయన సామాన్యుడు కాదు అనుకుని మనసులోనే నమస్కరించుకొన్నాను. నేను వెంటనే బస్సు ఎక్కి విజయవాడ వచ్చేసరికి రాత్రి గం॥1:00 అయింది.

అదే రోజు తెల్లవారుజామున మళ్లీ బాబాగారు కలలో కనిపించి, "బిడ్డా! చూసావా నా లీల! నీకు వ్యాపారం ఇప్పించాను. జాగ్రత్తగా చేసుకో. నువ్వు నా మార్గాన్ని అనుసరించు. నేనే వారి ఆత్మలో వారి ఇష్ట దైవం రూపంలో పలికించాను" అన్నారు. "బాబా! ఇది మీ లీల అంటున్నారు. అక్కడ మీ ఫోటో ఒకటి కూడా లేదు" అన్నాను. "ఎందుకు లేదు చూడు" అని మళ్లీ చెయ్యి పైకి కిందకి ఊపారు. నాకు దృశ్యం కనబడుతోంది. స్టాక్ ఉండే గోడౌనులో ఒక అరలో ఆరు బై ఆరు టైల్

పైన, రెడ్ కలర్ డ్రెస్ లో బాబా బొమ్మ ఉంది. దాని ముందు రెండు అగరబత్తీలు వెలుగుతున్నాయి.

అప్పుడు బాబా అన్నారు, "రేపు పొద్దున హౌరా ఎక్స్ ప్రెస్ ఎక్కి ఒంగోలు వెళ్ళి ఆ షాపులో నేను చెప్పినట్లు ఉందో లేదో చూడు" అన్నారు. నేను తెల్లవారి లేచి మళ్ళీ ఒంగోలుకి బయలుదేరుతుంటే ఈసారి మాఇంట్లో వాళ్ళు నాకేదో అయ్యిందని ఏడవడం మొదలుపెట్టారు. వాళ్ళందరికీ నచ్చచెప్పి బయలుదేరాను. హౌరా రైలు ఎక్కి ఒంగోలు చేరుకుని షాపుకి వెళ్ళాను. హనుమంతరావుగారు నన్ను చూసి, "ఏంటి! నిన్న వెళ్లలేదా?" అని అడిగారు. "లేదండీ, ఇప్పుడు వెళదామని అనుకుంటున్నాను" అని, "ఒకసారి షాపు లోకి వెళ్ళి చూడొచ్చా?" అని అడిగాను. ఓ! తప్పకుండా అని అందులో పని చేసే అబ్బాయిని పిలిచి నాకు షాప్ చూపించమని చెప్పారు.

నేను గోడౌన్ లోకి అడుగుపెట్టాను. అది చాలా పెద్ద హాలు. నేను బాబాగారు కలలో చూపించిన షెల్ఫ్ కోసం వెతుకుతున్నాను. సరిగ్గా ఆయన చెప్పిన చోటే ఒక టైల్ ఉంది. దాని పైన రెడ్ కలర్ డ్రెస్ లో ఉన్న బాబా బొమ్మ ఉంది. దాని ముందు రెండు అగరవత్తులు వెలుగుతున్నాయి. నేను అది చూసి దిగ్భ్రాంతి చెందాను. తిరిగి షాపులోకి వచ్చి కూర్చుని, లోపల చూసిన విషయం ఆయనకి చెప్పి, ఆ టైల్ మీద ఉన్నాయన ఎవరు అని అడిగాను. 'శిరిడి సాయిబాబా గారు' అన్నారు. 'మన ప్రాంతంలో ఈయన గురించి ఎవరికీ తెలియదే మీకు ఆ ఫోటో ఎలా వచ్చింది' అని అడిగాను. "మా చిన్నబ్బాయి మద్రాస్ కి వెళ్ళినప్పుడు ఎగ్జిబిషన్ కి వెళ్ళాడు, అక్కడ కనబడితే బాగుందని తెచ్చాడు, అప్పటినుంచి రోజు రెండు కడ్డీలు వెలిగిస్తాడు" అని చెప్పారు. నాకు ఒక దాని తర్వాత ఒకటి జరిగే సంఘటనలు విపరీతంగా ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. ఇంక శిరిడీ బాబావారిని ఎప్పటికీ వదలకూడదు అనుకున్నాను. తర్వాత ఇంట్లో అందరికీ నేను ఆ షాప్ తీసుకుంటున్నట్లు చెప్పాను. నేను మోసపోతున్నానని డబ్బులన్నీ పట్టుకెళ్ళి వాళ్లకి ఇచ్చేస్తున్నానని గోల చేశారు. "ఏది ఏమైనా నా నిర్ణయం మారదు" అని చెప్పాను.

నాకు గుంటూరు బ్యాంకులో కొంత డబ్బు ఉంది. ఒకరోజు గుంటూరు వెళ్ళి, బ్యాంక్ లో ఆ డబ్బులు తీసుకుని, నాలుగు వీధుల అవతల ఒక బాబా గుడి ఉంటే అక్కడికి వెళ్లి బాబా పటం దగ్గర ఆ డబ్బంతా పెట్టి, "బాబా! ఇది తీసుకొని ఒంగోలు వెడుతున్నాను, మీరు నాకు తోడుగా ఉండి నడిపించాలి" అని చెప్పాను. అప్పుడు కూడా బాబా పటంలో నుంచి నీలం రంగు వెలుతురు బయటకు వచ్చి, పక్క గోడ మీద కాంతి పడి అందులోంచి బాబావారు బయటికి వచ్చారు. సన్నగా తెల్లగా కఫ్నీ ధరించి ఉన్నారు. నాకు నోటమాట రాలేదు. బాబాగారికి నమస్కారం చేసుకున్నాను. అప్పుడు బాబా నాతో, "ఈ డబ్బంతా తీసుకుని ఒంగోలు వెళ్లి అక్కడ షాపు యజమానికి అప్పచెప్పు. నీకు అంతా బాగుంటుంది, తర్వాత శిరిడీ వచ్చి దర్శనం చేసుకుని షాపు ప్రారంభించు అన్నారు. "బాబా! మా ఇంట్లో వాళ్ళు, బయట వాళ్ళు, ఎవ్వరూ ఈ విషయాలు చెబుతుంటే నమ్మడం లేదు. నాకేదో పిచ్చి పట్టిందని నన్ను ఎగతాళి చేస్తున్నారు" అన్నాను. అప్పుడు బాబా "అవునా! అయితే విను, 1991వ సంవత్సరానికల్లా ప్రతివాడు ఈ పిచ్చిలోకి రావాల్సిందే. 1995 నాటికి ప్రతి ఊర్లో నా గుడి ఉండవలసిందే" అని చెప్పారు. అప్పుడు నేను, "బాబా! ఇలా మీరు నాకు మాత్రమే కనబడుతున్నారా, ఇంకెవరికైనా కూడా కనబడతారా?" అనడిగితే, "ఇలా అందరికీ కనబడడం సాధ్యం కాదు, నీకు 7565 జన్మల పుణ్యఫలం ఉన్నందువల్ల నేను నీతో మాట్లాడుతున్నాను" అని చెప్పి మాయమైపోయారు.

నేను, మా బావమరిది కలిసి ఈ డబ్బు తీసుకొని ఒంగోలు వెళ్ళాం. మేము తీసుకోబోయే షాపు యజమానికి డబ్బు ఇచ్చాక, నోటు రాసి తాళాలు నా చేతికిచ్చి, మంచి రోజు చూసి ప్రారంభించమన్నారు. సరేనని చెప్పి, ఇక్కడ దగ్గర్లో బాబా గుడి ఎక్కడైనా

ఉంటే చెప్పండి వెళ్లి దర్శనం చేసుకుని వస్తాము అంటే, లాయర్ పేటలో బాబా గుడి ఉందని చెప్పారు. మేమిద్దరం గుడికి వెళ్ళి దర్శనం చేసుకున్నాక, అక్కడ పూజారి హరి గారు, నా వైపు చూసి "ఇక్కడ భరద్వాజ మాస్టరుగారని ఒకాయన ఉన్నారు, ఆయన బాబా గురించి బాగా చెప్తారు. ఒకసారి వెళ్లి దర్శనం చేసుకోండి, పాత ఇండియన్ గ్యాస్ ఆఫీస్ సందులో ఉంటారు" అని చెప్పారు. నాకు అంతగా నమ్మకం లేకపోయినా మా బావమరిది వెళదామంటే సరేనని వాళ్ళ ఇంటికి వెళ్ళాం.

మేము వెళ్లేసరికి సత్సంగం, హారతి అయిపోయాయట, సత్సంగ సభ్యులందరూ పూజ్యశ్రీ మాస్టరుగారికి నమస్కారం చేసుకుంటున్నారు. ఆయన వాళ్లకు ప్రసాదం ఇస్తున్నారు. మేము కూడా వరుసలో నిలుచున్నాము. నా ముందు మా బావమరిది ఉన్నాడు. నేను నా మనసులో, 'ఈ కాలంలో కూడా సామాన్య మానవుల పాదాలు పట్టి నమస్కారాలు చేస్తున్నారు' అనుకుంటున్నాను. నా వంతు వచ్చింది. నేను కూడా నమస్కారం చేసుకున్నాను. వారు కుడిచేత్తో విభూది తీసుకుని నాకు బొట్టు పెట్టబోతూ ఒక్క నిమిషం ఆగి, బాబా పటం వైపు కొద్దిసేపు చూసి "ఏరా! ఎప్పుడు షాపు ఓపెన్ చేస్తున్నావు?" అని అడిగారు. "ఏంటి మాస్టారూ షాపేంటి?" అన్నాను. 'షాపు ఏంటంటావేమిటిరా, ఏమీ తెలియనట్లు. బాబా నీకు ఎలక్ట్రికల్ షాపు ఇప్పించారుగా" అన్నారు. ఈయనకు ఇవన్నీ ఎలా తెలుసని ఆశ్చర్యపోతూ, "బాబా మీకు చెప్పారా సార్? మీతో ఫోటోలోంచి మాట్లాడుతున్నారా?" అనడిగాను. "అవునురా, ఫోటో లోనించే మాట్లాడుతారు, ఆయనకి ఫోటోకి తేడా లేదుగా. ఈ విషయం నీకూ తెలుసుగా. నీతో విజయవాడలో, గుంటూరులో మాట్లాడారుగా" అన్నారు. వెంటనే ఒళ్ళు పులకరించింది. పూజ్యశ్రీ మాస్టరుగారికి మనస్ఫూర్తిగా నమస్కారం చేసుకొని, "క్షమించండి మీరు ఏంటో తెలియక అలా మాట్లాడాను" అన్నాను. "సరేలే,, షాపుకి 'శిరిడిసాయి ఎలక్ట్రికల్స్' అని పేరు పెట్టు. ఏప్రిల్ 20వ తేదీన ప్రారంభించు. ఈలోగా శిరిడి వెళ్లి, భార్యాభర్తలు ఇద్దరూ మూడు రోజులు ఉండి ద్వారకామాయిలో నిద్ర చేయమని చెప్తున్నారు బాబా" అన్నారు. అలాగేనండి అని చెప్పి నమస్కారం చేసుకుని వచ్చేస్తుంటే, శ్రీ సాయి లీలామృతము గ్రంథం ఇస్తూ దానిమీద "గాడ్ బ్లెస్స్ యు విత్ నోబుల్ లైఫ్" అని రాసిచ్చారు. తర్వాత అందరూ, ఈ విధంగా ఎవరికీ ఆశీస్సులు ఇవ్వలేదని చెప్పారు.

నేను నా భార్య, పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్లే శిరిడి వెళ్ళాం. అక్కడ మళ్ళీ బాబా ప్రత్యక్ష దర్శనం ఇచ్చారు. "ఒరేయ్! భరద్వాజ చెప్పినట్లు, శిరిడి సాయి ఎలక్ట్రికల్స్ అని పేరు పెట్టుకుని అతని చేత ప్రారంభోత్సవం, పూజా కార్యక్రమాలు చేయించు" అన్నారు. "మీ అనుగ్రహం ఉంది కదా బాబా, మళ్ళీ వారికి ఎందుకు శ్రమ?" అన్నాను. "భరద్వాజ తోనే చేయించరా, ఇది నా ఆజ్ఞ" అన్నారు. అమ్మో! బాబాగారు మాస్టరుగారికి చాలా ప్రాముఖ్యత ఇస్తున్నారే అనుకున్నాను. నాకు బాబా కనిపించి మాట్లాడినప్పుడల్లా ఆయన దేవుడు, నేను సామాన్య మానవుడిని అని ఉండేది కాదు. చాలా మామూలుగా ఒక వ్యక్తితో మాట్లాడినట్టే ఉండేది. అందుకే తిరిగి ప్రశ్నలు కూడా వేసేవాడిని.

శిరిడి నుంచి తిరిగి వచ్చాక షాపు ప్రారంభించడానికి ముహూర్తం నిర్ణయించుకుని, కార్డు కొట్టించుకుని, పూజ్యశ్రీ మాస్టరుగారిని షాపు ప్రారంభించమని ఆహ్వానిద్దామని వారి ఇంటికి వెళ్లాను. తీరా వెళ్లాక, పూజ్యశ్రీ మాస్టరుగారు హైదరాబాద్ వెళ్లారని, ప్రారంభోత్సవానికి రాలేకపోవచ్చునని ఆ సమయానికి హైదరాబాదులోనే ఉంటారని ఇంట్లో వారు చెప్పారు. నాకు చాలా బాధనిపించింది. వారితో ప్రారంభోత్సవం చేయించమని బాబా చెప్పారు. మాస్టరుగారేమో ఊర్లో లేరు, ఏం చేయాలో తోచలేదు. పూజ్యశ్రీ మాస్టరుగారితో మాట్లాడడానికి వీలవుతుందా అనడిగితే, ఒక ఫోన్ నెంబర్ ఇచ్చారు. ఫోన్ చేసి విషయం వివరిస్తే

మాస్టరుగారు, "రావడానికి కుదరదు రా, ఇక్కడ సత్సంగాలు చేయాలి, కరపత్రాలు కూడా పంచేశారు" అన్నారు. ఇక చేసేదేమీ లేక, బాబాకి ఒక నమస్కారం చేసుకొని, నా ఏర్పాట్లు నేను చేసుకుంటున్నాను. లోపల విపరీతంగా బాధగా ఉంది, 'ఆదిలోనే హంసపాదం' అన్నట్లుగా ఇలా జరిగింది ఏమిటి? అని బాధపడేవాడిని. ఏప్రిల్ 20వ తేదీ రానే వచ్చింది. ఆరోజు ఉదయం 11 గంటల 20 నిమిషాలకు ముహూర్తం. ఒక పూజారిని మాట్లాడుకున్నాను. 11:18 నిమిషాల వరకు చూసాను. ఇక పూజారిని మొదలు పెట్టమందామని అనుకునే సరికల్లా 11:19 కి పూజ్యశ్రీ మాస్టరుగారు స్కూటర్ మీద ఎవరితోనో వచ్చారు. నా ఆనందానికి అవధులు లేవు. పూజ్యశ్రీ మాస్టరుగారు తిన్నగా బాబా పటం దగ్గరికి వెళ్లారు. రెండు పుస్తకాలు తీసి "శ్రీరామ శ్రీరామ" అని రాశారు. అనుకున్న సమయానికి పూజ్యశ్రీ మాస్టరుగారు ప్రారంభోత్సవం చేశారు. దాదాపు 200 మంది దాకా మా వాళ్ళు వచ్చారు. పూజ అంతా అయ్యాక, పూజ్యశ్రీ మాస్టరుగారితో, "రాలేనని చెప్పారు కదా ఎలా వచ్చారు?" అని అడిగాను. "ఏం లేదురా, 'వాడు బాధపడుతున్నాడు నువ్వు ఒంగోలు వెళ్ళు' అని బాబా ఆజ్ఞాపించారు. అందుకే సత్సంగం మానుకొని వచ్చాను. నిన్న రాత్రి బస్సులో బయలుదేరాను. ఇక్కడికి ఉదయం 7:00కి రావాల్సింది. 10:45 కి వచ్చింది. బాబా తిన్నగా ఇక్కడికి రమ్మన్నారు. అదే సమయానికి సీతారామయ్య కనిపిస్తే ఆయన బండి మీద వచ్చాను" అన్నారు.

ఆ విధంగా ఒంగోలులో బాబాగారి నిర్ణయం ప్రకారం 'శిరిడి సాయి ఎలక్ట్రికల్స్' అనే షాపు ప్రారంభమై, నేను వ్యాపారం మొదలుపెట్టాను. సాయి చెప్పిన మార్గంలో పయనిస్తూ వారి అండదండలతో మా ఐదుగురు చెల్లెళ్లకు పెళ్లిళ్లు చేశాను. నాకు ఒక అమ్మాయి. తన పెళ్లి కూడా చేశాను. అందరం శ్రీ బాబాగారిని ఆశ్రయించుకొని వారి నీడలో చల్లగా హాయిగా ఉన్నాం!! ●

## సన్నిధానంలో గురు భరద్వాజుని బ్రహ్మానుభూతి పర్వదినం!

21వ పేజీ తరువాయి

ప్రదేశంలో, అతి పవిత్రమైన ధుని పూజ మనం చేసుకుందాం. మీ అందరి తరపున నేను చేస్తాను. మీరందరూ మనసులో ధుని పూజ చేస్తూ వుండాలి. అలాగే దీక్ష అందరికీ బాగా జరిగిందనుకుంటున్నాను.

ఇక్కడ పూజ్యశ్రీ అమ్మగారు చెప్పిన ఒక ప్రయోజనం వున్నది. దీక్ష పూర్తవ్వగానే మామూలుగా అయిపోకూడదు. దీక్ష అంటే మనలో శాశ్వతంగా వచ్చే మార్పు. ఈ దీక్ష అనే ఊతంతో ఎలాంటి మార్పులు చేసుకోగలిగామో వాటిని నిలబెట్టుకోవడం కోసం ప్రయత్నం చేయాలి. దాంతోపాటు నా సలహా ఏంటంటే రేపు మార్చి 6 కళ్యాణ మహోత్సవం రాబోతోంది. కనుక మార్చి 6 లోపల భగవాన్ భరద్వాజ, మహాత్ముల ముద్దుబిడ్డడు, పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి పూజ్యశ్రీ అమ్మగారు వ్రాసిన వ్యాసాలు, మహాపురుషుడు గ్రంథం – ఇవి ఒకసారి చక్కగా చదువుకొని, ఇప్పుడు మనసు ఎంత పట్టుతో వుందో దానినుంచి శ్రద్ధ పెంచుకొని, మార్చి 6 కు వెళ్లాలి. కాలం చాలా ముఖ్యమైనది. అది గుర్తుపెట్టుకుని అందరూ కాలాన్ని సద్వినియోగం చేసుకొని మన జీవితాన్ని కూడా సార్థకం చేసుకుందాం. ఆ కృపకి పులకిస్తూ కృతజ్ఞతగా ఈరోజు మనం ధుని పూజ చేసుకుందాం" – అని చెప్పి తమ సత్సంగాన్ని ముగించారు.

తరువాత శ్రీమతి వేదమ్మగారు ఈకార్యక్రమం కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ధునికి షోడశోపచార పూజ చేసి అనంతరం దీక్ష తీసుకున్న వారందరి తరపున పూజలో పెట్టుకున్న కొబ్బరికాయలను సమర్పించి, నివేదన, మంగళహారతులతో ఆ రోజు వుత్సవానికి స్వస్తి పలికారు. ●

# ఆచార్యుని అద్భుత లీలలు

శ్రీ రామకిషన్ రావు, హైదరాబాదు

హైదరాబాదుకు చెందిన రామకిషన్ రావుగారు తన జీవితంలో చవిచూసిన పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజ గురుదేవుల లీలావైభవాన్ని వారి వల్ల పొందిన కృపా విశేషాలను ఈ విధంగా తెలియజేస్తున్నారు.

## ప్రథమ దర్శనం - నాంపల్లి బాబా ఆశీస్సులు

నేను మొట్టమొదట పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి మా బావమరిది డాక్టరు శశిరావుగారి ద్వారా విన్నాను. 1977-78 లో ఒక సాయంత్రం దోమలగూడ బాబా గుడికి విచ్చేసివున్న వారి దర్శనానికి వెళ్ళాను. మర్నాడు కూడా వారి ప్రసంగం ఆ గుడిలోనే వుంది. ఆ రోజు సత్సంగం తరువాత నేను పూజ్యశ్రీ మాస్టరుగారితో మాట్లాడాలని వేచివుంటే వారే నన్ను పలకరించారు! నేను నమస్కారం చేసుకొన్నాక పూజ్యశ్రీ మాస్టరుగారు నాతో, "రేపు ఉదయం నువ్వు నాంపల్లి పోలీసుస్టేషనులో వుండే నాంపల్లి బాబా దర్శనం చేసుకుని తిరిగి సాయంత్రం మళ్ళీ సత్సంగానికి ఇక్కడికి రా! దగ్గరికి వెళ్ళి వారిని ఇబ్బంది పెట్టకుండా దూరం నుంచే నమస్కారం చేసుకో!" అని చెప్పారు. మరునాడు పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్లే నాంపల్లి బాబాను దర్శించి నమస్కారం చేసుకున్నాను. ఆయన నన్ను టీ అడిగారు. నేను సమర్పించిన టీ త్రాగి దుప్పటి కప్పుకొని పడుకున్నారు. నేను తిరిగి వచ్చేశాను. సాయంత్రం పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శించుకుని నాంపల్లి బాబా వద్దకు వెళ్ళానని చెబితే వారు చాలా సంతోషించి, నాకు శ్రీ సాయిలీలామృతము గ్రంథం మీద సంతకం చేసి ఇచ్చి పారాయణ చేసుకోమన్నారు. అలా వారు నాకు తమ ఆశీస్సులను, నాంపల్లి బాబా దర్శనాన్ని, శ్రీ సాయిలీలామృతం గ్రంథాన్ని మొట్టమొదటి దర్శనంలోనే ప్రసాదించారు.

## సంకల్ప శక్తి - పారాయణ ఫలం - ఉద్యోగ ప్రాప్తి

డిగ్రీ పూర్తయిన తరువాత నేను ఐ.సి.డబ్ల్యూ.ఏ.లో చేరి పూర్తిచేయలేక, ఉద్యోగం దొరకక ఇబ్బందిపడ్డాను. అప్పటికే నాకు వివాహమైంది. నా పరిస్థితి చూసి నా స్నేహితుడు నన్ను వారు నమ్మే ఒకాయన దగ్గరకు తీసుకెళ్లాడు. ఆయన నేను ఏమీ అడగకుండానే, "నీకు ఉద్యోగం రాదు, వ్యాపారమే చేసుకోవాలి!" అని చెప్పారు. నాకు చాలా బాధ కలిగి ఇంటికి రాగానే పూజ్యశ్రీ మాస్టరుగారికి ఉత్తరం వ్రాశాను. వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారు, "నువ్వేం బాధపడకు! శ్రీగురుచరిత్ర ఏడు సప్తాహాలు, శ్రీసాయి లీలామృతము మూడు సప్తహాలు పారాయణ చేసుకో! ఒకవేళ అంతగా ఉద్యోగం రాకపోతే, నువ్వు, అమ్మాయి ఇద్దరు ఒంగోలు వచ్చేసేయండి. నువ్వు ప్రెస్ లో పనిచేద్దువు గాని, అమ్మాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో టీచరుగా చేస్తుంది" అని చెప్పారు. పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన పారాయణ పూర్తి చేసిన రెండోరోజుకి చిత్రంగా మెడినోవా ఆసుపత్రిలో కార్పొరేట్ ఆఫీసులో ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ గా నాకు ఉద్యోగం వచ్చింది! వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారికి కృతజ్ఞతతో ఉత్తరం వ్రాశాను. ఆయన చాలా సంతోషించి పారాయణ మాత్రం మానకుండా చేసుకోమని చెప్పారు.

మెడినోవాలో పూజ్యశ్రీ మాస్టరుగారి విద్యార్థి అయిన శ్రీనివాసులురెడ్డిగారితో పరిచయమైంది. ఆఫీసులో కలిసినప్పుడు ఆయన నాకు మాస్టరుగారి గురించి, బాబాగురించి ఎన్నో విషయాలు చెప్పేవారు.

## మాస్టరుగారి జ్ఞాపకశక్తి, వారి ఆప్యాయత

చాలాకాలం తర్వాత రాణిగంజ్ బాబా మందిరంలో ప్రవచనం చెప్పడానికి పూజ్యశ్రీ మాస్టరుగారు వచ్చారు. మొదటిసారి నా భార్యను తీసుకొని వారి దర్శనానికి వెళ్లాను. వారు నా భార్యను చూస్తూనే, "మీరు డాక్టరుగారి చెల్లెలా?" అంటూ ఆప్యాయంగా పలకరించారు! మొదట్లో ఎప్పుడో మా బావమరిది పేరు చెప్పి (డాక్టరు శశిరావు), వారి ద్వారానే మీ గురించి తెలిసిందని చెప్పిన విషయం ఆయనకు ఇప్పటికీ గుర్తున్నందుకు నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. సత్సంగమయ్యాక వారి ఆశీస్సులు తీసుకుని బయలుదేరాము.

## సత్సంగ ప్రభావం

మెడినోవానుంచి నేను బేగంపేటలో మహర్షి కాలేజీలో ఉద్యోగంలో చేరాను. అక్కడ టి.ఎం. నేర్పించడానికి విజయ్ కుమార్ గారు, శ్రీమతి సులోచనగారు వస్తుండేవారు. వారికి పూజ్యశ్రీ మాస్టరుగారు తెలుసని నాకు తెలియదు. నేను ఆ క్లాసులకి హాజరైనప్పుడు వారు పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన మాటలను చెబుతూ వుండేవారు. అప్పుడు నేను వారిని, "మీకు భరద్వాజ మాస్టరుగారు తెలుసా?" అని అడిగాను. "వారు మా గురువుగారు" అని చెప్పారు. నాకు ఎంతో సంతోషం కలిగింది. నాతో చాలా సన్నిహితంగా వుండేవారు. అలా నేను ఉద్యోగం చేసే ప్రతిచోటా పూజ్యశ్రీ మాస్టరుగారు తెలిసినవారు వుండటం వల్ల మంచి సత్సంగం జరిగేది. అది పూర్తిగా పూజ్యశ్రీ మాస్టరుగారి దయ!

## బాబా స్వప్న దర్శనం

ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు, "మీకు ఎప్పుడైనా బాబా స్వప్నదర్శనమిచ్చారా?" అని అడిగారు. లేదని చెప్పాను. ఆ తర్వాత నాకు ఒక స్వప్నం వచ్చింది. అందులో నేను పనిచేసే ఆఫీసు బయట నిలబడి వున్నాను. ఎంతోమంది జనం పెద్ద ఊరేగింపుగా వెళుతూ వున్నారు. మా ఆఫీసులో పనిచేసేవారిని, "ఇక్కడ ఏమి జరుగుతోంది?" ' అని అడిగితే, "అయ్యో నీకు తెలియదా? బాబా వస్తున్నారు!" అని చెప్పారు. ఇంతలో నా ముందునుంచి బాబా ఊరేగింపుతో వెళ్లి ఆ పక్కనేవున్న ఏడంతస్తుల పెద్ద భవనంలోని ఏడవ అంతస్తుకు వెళ్లారు.

నేను కూడా వారి వెనకనే ఆ పైకి ఎక్కి ఎప్పటినుంచో చాలా పరిచయం వున్నవాడిలా, "బాబా!" అని ఆయనను పట్టుకుని నమస్కారం చేసుకుంటే ఆయన నా తలనిమిరారు. నాకు మెలకువ వచ్చేసింది. వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారికి ఈ స్వప్నం చెప్పాను. వారు, "నీకు బాబాతో సంబంధముంది. పారాయణ మాత్రం ఎప్పుడూ మానకుండా చేసుకుంటూవుండు!" అని చెప్పారు.

## సమాధి నుండి కూడా రక్షణ

పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి చెందారని తెలిసి నా భార్యకు చెప్పగానే ఆమె చాలా గట్టిగా ఏడ్చేసి, "మాస్టరుగారిని బాబా ఎందుకు తీసుకెళ్లారు? నాలాంటి దాన్ని తీసుకెళ్లొచ్చు కదా!" అని చాలా బాధపడింది. తరువాత కొన్నిరోజులకు మేము పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధిని దర్శించుకున్నాము. సమాధికి నమస్కారం చేసుకుంటున్నప్పుడు నా భార్యకు షాక్ కొట్టినట్టు అనిపించిందిట. ఆమె, "పూజ్యశ్రీ మాస్టరుగారు ఇక్కడ తప్పక వున్నారు!" అని చెప్పింది. తర్వాత పూజ్యశ్రీ అమ్మగారిని కూడా దర్శించుకున్నాము.

నేను, నా భార్య, నాకు పరిచయం చేసిన మా బావమరిది కుటుంబం - అందరమూ పూజ్యశ్రీ మాస్టరుగారి మార్గంలో నడుస్తూ వారి ఆశీస్సులను పొందుతూనే వున్నాము. ఎప్పటికీ వారి కృపాశీస్సులు మాపై ఇలాగే వర్షించాలని మనసారా ప్రార్థిస్తున్నాను.

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**

Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271
*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*

### శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

### శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము | ₹20.00 |
| (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | |

### ఇతర మహాత్ముల గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి | ₹99.00 |
| (రచన : శ్రీమతి శారదా వివేక్) | |
| అవధూత శ్రీ చివటం అమ్మ | ₹99.00 |
| (రచన : శ్రీమతి శారదా వివేక్) | |

### అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

### ధ్యాన సంబంధమైన గ్రంథములు

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

### ఆధ్యాత్మికత – తత్వచింతనా పూర్వక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి | ₹199.00 |
| (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | |

### ఇతర గ్రంథములు

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

### పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | ₹149.00 |
| (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | |
| భగవాన్ శ్రీ భరద్వాజ | ₹299.00 |
| (రచన : శ్రీమతి శ్రీదేవి) | |
| మహా పురుషుడు | ₹60.00 |
| (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1 | ₹199.00 |
| (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2 | ₹199.00 |
| (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | |
| ఆచార్య అమృత లేఖావళి | ₹199.00 |
| (సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు | ₹99.00 |
| (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | |

### బాలల కొరకు విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము | ₹49.00 |
| (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | |
| బాలల సాయిసన్నిధి | ₹75.00 |
| (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | |
| బాలల శ్రీ గురు చరిత్ర | ₹75.00 |
| (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master | ₹80.00 |
| *(Author: Smt. Adidam Vedavati)* | |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |











ఫిబ్రవరి 9 సోమవారం నాడు శ్రీ భరద్వాజ్ మహారాజ్ బ్రహ్మానుభూతి పర్వదినం సందర్భంగా గురుపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు మాతృదేవి దివ్యసన్నిధానములో విశేష పూజ, సత్సంగ ప్రవచనము చేశారు. అనంతరము జనవరి 1వ తేదీ నుండి 'శ్రీసాయి మాస్టర్ మండల దీక్ష' లో పాల్గొన్న భక్తులందరి తరపున ధుని పూజ చేసి ఆహుతులను సమర్పించి దీక్షా విరమణ కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Postal Registration Number : Prakasam/2026-2028, Regd. No. APTEL/26/A0220






















పూజ్య గురుదంపతుల లీలాకళ్యాణ మహోత్సవాన్ని తిథి ప్రకారము ఫిబ్రవరి 11వ తేదీ, బుధవారం నాడు హైదరాబాదు, విద్యానగర్, బాపట్ల, చీరాల, పామూరు, బనగానపల్లె, కావలి మొదలైనచోట్ల భక్తులందరూ ఆనందోత్సాహాలతో, భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు.

This periodical is published by Revuri Seshachala Sasidhar from Ongole on behalf of Ekkirala Vikramaditya, edited by Revuri Seshachala Sasidhar and printed by Janatha Offset Printers at Nirmal Nagar, Ongole".
[according to the Press and Registration of Periodicals (PRP) Act, 2023].